# మనసులో మాట

KANCHARLA

నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

## కోస్తాంధ్ర

| | | | |
|---|---|---|---|
| తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా | |
| గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | ఏలూరు |

శుక్రవారం 17 ఏప్రిల్ 2026 పేజీలు : 16




# గ్యాస్ దోపిడీ!

## కేజీ బేసిన్లో దేశంలోనే అతి పెద్ద లూటీ

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ
- కృష్ణా, గోదావరి బేసిన్లో పుష్కలంగా గ్యాస్, చమురు నిల్వలు
- రాష్ట్ర వాటా కోరుతూ అసెంబ్లీలో తీర్మానం
- రాష్ట్ర వ్యాప్తంగా సమర శంఖారావం
- అవసరమైతే మోడీ మెడలు వంచాలని సదస్సు డిమాండు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 16:** కృష్ణా, గోదావరి బేసిన్లో దేశంలోనే అతి పెద్ద లూటీ జరుగుతోందని, రాష్ట్ర ప్రజల అవసరాల కోసం గ్యాస్, చమురులో 50 శాతం వాటా లక్ష్యంగా సమర శంఖారావం పూరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని డిమాండు చేశారు. అప్పటికీ కేంద్ర ప్రభుత్వం దిగి రాకుంటే ఎన్డీఏ మద్దతు ఉపసంహరించుకుని మోడీ మెడలు వంచాలని డిమాండు చేశారు. కేజీ బేసిన్లో గ్యాస్, చమురుపై వాటా కోసం రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహించి ప్రజలను కార్యోన్ముఖులను చేయాలని తెలిపారు. కేజీ బేసిన్ గ్యాస్, చమురు సాధన సమితి ఆధ్వర్యంలో రాజమండ్రి సంహిత కన్వెన్షన్ సెంటర్లో గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీపీఎం జిల్లా కార్యదర్శి టీ అరుణ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టీ మధు అధ్యక్షత వహించారు.

కేజీ బేసిన్లో గ్యాస్, చమురులో సగం వాటా రాష్ట్ర ప్రజల అవసరాలకు కేటాయిం చాలని, పీఎన్జీ గ్యాస్ ఇంటింటికీ సరఫరా చేయాలని, సహజ వనరుల నిర్వహణ బాధ్యత ప్రభుత్వమే చేపట్టాలని కోరుతూ ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సదస్సును ఉద్దేశించి వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ 'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా పాలక వర్గాల తీరు ఉందని విమర్శించారు. అయిల్ పై పెత్తనం కోసం ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న దురాక్రమణ గురించి వివరించారు. యుద్ధం ఫలితంగా ఏర్పడిన గ్యాస్ కొరత నేపథ్యంలో దేశ వ్యాప్తంగా తీవ్రమైన సంక్షోభం నెలకొందని అన్నారు. కృష్ణా, గోదావరిలో పుష్కలమైన గ్యాస్, చమురు నిల్వలు ఉన్నాయని, ఇక్కడి నుంచి యథేచ్ఛగా తరలించుకుపోయి కార్పొరేట్ సంస్థలు లాభాలు గడిస్తున్నాయని అన్నారు. సహజ వనరులపై రాష్ట్రాలకు 50 శాతం వాటా కల్పించాలని 12వ ఆర్థిక సంఘం చెప్పిందని గుర్తు చేశారు. అదే విధంగా పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ అప్పటి ప్రభుత్వానికి ఏకగ్రీవ తీర్మానం పంపించినా పాలక పక్షాలు ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన అనంతరం - మిగతా వార్త 2లో




## సెన్సస్-2027లో స్వీయ నమోదు ప్రారంభం

- స్వీయ నమోదు చేసుకున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి
- సెన్సస్ 2027లో స్వీయ నమోదుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి
- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పిలుపు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 16:** సెన్సస్-2027లో భాగంగా స్వీయ నమోదు ప్రక్రియను గురువారం రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్వయంగా నిర్వహించారు. భారత దేశ చరిత్రలో తొలిసారిగా సమగ్ర కుటుంబ సర్వేను ప్రజలే తమ ఇంటి నుంచే ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకునే విధానం అందుబాటులోకి రావడం గొప్ప ముందడుగు అన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ కుటుంబ వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, - మిగతా వార్త 2లో




## జలధారతో భూగర్భ జలాల పెంపు దిశగా సమగ్ర కార్యాచరణ

- చెరువుల పునరుద్ధరణపై సమగ్ర నివేదికలు సమర్పించాలి
- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 16:** రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జీ జయలక్ష్మి సమక్షంలో వెలగపూడి నుంచి వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భూములపై 22-ఏ తొలగింపు కేసులు, పునఃసర్వే, ఆదాయ రికార్డుల డిజిటలీకరణ వంటి అంశాలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష చేపట్టారు. ఈ సమావేశంలో వివిధ శాఖల కార్యదర్శులు, భూ పరిపాలన, స్టాంపులు-నమోదులు, సర్వే-సెటిల్మెంట్స్ శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు. అలాగే 'జలధార' ప్రాజెక్టుపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించగా, - మిగతా వార్త 2లో

# నేను జనగణనలో పాల్గొన్నా.. మరి మీరు..



- జనగణన-2027లో మంత్రి కందుల దుర్గేష్ తొలి అడుగు
- రాజమహేంద్రవరంలోని తన నివాసంలో స్వయంగా జనగణన వివరాలు నమోదు చేసుకున్న మంత్రి
- దేశ ప్రగతికి 'జనగణన' దిక్సూచి అని, జనగణనలో నేను నమోదు చేసుకున్నాను.. మీరు కూడా పాల్గొనండి!" మంత్రి దుర్గేష్ పిలుపు
- ప్రజాస్వామ్య పరిపాలనలో జనాభా లెక్కలే కీలకం..జనాభా ప్రాతిపదికనే సంక్షేమ పథకాల రూపకల్పన జరుగుతుంది..జనగణనలో ప్రజలంతా భాగస్వాములు కావాలని వెల్లడి
- ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొని అధికారులకు సహకరించాలని మంత్రి దుర్గేష్ విజ్ఞప్తి
- 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' ప్రారంభం అయింది.. అధికారులకు ప్రజలు సహకరించాలని మంత్రి దుర్గేష్ పిలుపు
- ఏప్రిల్ 30 వరకు 'సెల్ఫ్ ఎన్యూమరేషన్'కు అవకాశం.. మే 1 నుండి ఇంటింటికీ ఎన్యుమరేటర్లు వచ్చి వివరాలు నమోదు చేసుకుంటారు: మంత్రి దుర్గేష్



## మహిళా రిజర్వేషన్ బిల్లుతో నవశకం

- నిర్ణయాధికారంలో ఇక నారీశక్తిదే కీలక పాత్ర
- 2029 నుంచే మహిళా రిజర్వేషన్లు అమలు ఖాయం కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

మిగతా 2




## సెన్సస్-2027లో స్వీయ నమోదు ప్రారంభం

**- మొదటి పేజీ తరువాయి** ఇది ప్రభుత్వానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించడంలో ఉపయోగపడుతుందని తెలిపారు. స్వీయ నమోదు ప్రక్రియ చాలా సులభంగా, తక్కువ సమయంలో పూర్తి చేయవచ్చని చెప్పారు.

సెన్సస్-2027 స్వీయ నమోదు ప్రక్రియలో భాగంగా వెబ్ సైట్ ఓపెన్ చేసి కొత్త యూజర్‌గా నమోదు చేసుకుని, మొబైల్ ఓటీపీ ద్వారా ధృవీకరణ పూర్తి చేసి యూజర్‌నేమ్, పాస్‌వర్డ్ సెట్ చేసుకోవాలి. అనంతరం లాగిన్ అయి కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా వివరాలు సహా అవసరమైన సమాచారాన్ని నమోదు చేసి, సమర్పించిన తరువాత లభించే రిఫరెన్స్ నెంబర్‌ను భద్రపరచుకోవాలి.

అలాగే క్షేత్ర స్థాయిలో ఇంటింటికి వచ్చే సిబ్బందికి ఈ వివరాలను తెలియజేయాలని సూచించారు. ఈ సర్వేలో వివరాలు తెలియజేయడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకి అందజేసే క్రమంలో ఒక గొప్ప ముందడుగా నిలవనుందని బుచ్చయ్య చౌదరి తెలిపారు.

ఈ కార్యక్రమంలో రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఆర్మ్ స్ట్రాంగ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుతో నవశకం

**న్యూఢిల్లీ/ భీమవరం, (మనసులో మాట) ఏప్రిల్ 16:** ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలో మహిళా సాధికారిత సాధించడమే లక్ష్యంగా మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిందని అందరి మద్దతుతో ఈ బిల్లు ఆమోదం పొందడం ఖాయమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడిన ఆయన మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు మహిళల సామాజిక, రాజకీయ భవిష్యత్తును మార్చబోయే ఒక గొప్ప ముందడుగు అని అభివర్ణించారు. 2023 లోనే నారీ శక్తి వందన్ అధినియంను ఏకాభిప్రాయంతో ఆమోదించామని గుర్తుచేశారు. దాని అమలు విషయంలో ఉన్న స్తబ్దతను ప్రధాని మోడీ తొలగించారని శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. ఈ 33% రిజర్వేషన్ల కోసం 2033 వరకు వేచి చూడాల్సిన అవసరం లేకుండా, 2029 నుంచే అమలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని ఆయన వెల్లడించారు. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టి బిల్లును విజయవంతంగా ఆమోదింప జేస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా మహిళలు ఈ బిల్లు కోసం ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారని మంత్రి అన్నారు. పార్లమెంట్‌లో జరుగుతున్న ఈ చారిత్రాత్మక చర్చను వీక్షించేందుకు క్షేత్రస్థాయిలో మహిళలంతా ఎంతో ఆసక్తితో టీవీల ముందు కూర్చోవడాన్ని తాను గమనించానని, ఇది వారిలో ఉన్న ఆకాంక్షకు నిదర్శనమని పేర్కొన్నారు. నిర్ణయాధికారంలో మహిళలకు సముచిత భాగస్వామ్యం కల్పించడం వల్ల దేశం మరింత అభ్యున్నతి పథంలో దూసుకుపోతుందని శ్రీనివాస వర్మ ఆకాంక్షించారు.

ప్రతిపక్షాల తీరుపై ఆయన స్పందిస్తూ డీలిమిటేషన్ ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేయడం సరికాదని అన్నారు. అసలు ఆ ప్రక్రియే ఇంకా ప్రారంభం కాలేదని ఆయన గుర్తు చేశారు. రాజ్యాంగబద్ధంగా డీలిమిటేషన్ ప్రక్రియ సక్రమంగా జరుగుతుందని, రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు బిల్లుల ఆమోదానికి సహకరించాలని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ పిలుపునిచ్చారు.

# గ్యాస్ దోపిడీ! - కేజీ బేసిన్లో దేశంలోనే అతి పెద్ద లూటీ

**- మొదటి పేజీ తరువాయి** రాష్ట్రం తీవ్రమైన సంక్షోభంలో ఉందని, ఇటువంటి పరిస్థితులలో కేజీ బేసిన్ పుష్కలమైన ఆర్థిక వనరు అని ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. అనంతరం తీర్మానం ప్రవేశ పెట్టారు. ప్రత్యేక హోదా, రాష్ట్ర విభజన హామీల సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో దురహంకార ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. రాష్ట్రంలో సహజ వనరులు యదేచ్ఛగా లూటీ జరుగుతుంటే బానిస పాలకులు నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్రానికి 50 శాతం వాటా చెల్లించాల్సిందేనని అన్నారు. ఇంటింటికీ పైప్లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేయాలని అన్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు ఆగ్రహానికి గురై పైప్లైన్లు బద్దలు కొట్టే పరిస్థితి తెచ్చుకోవద్దని హితవు పలికారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ సరళీకరణ విధానాలు అమలు అనంతరం పాలనలో వచ్చిన మార్పులను వివరించారు. 1995కు పూర్వం సహజ వనరులు, పరిశ్రమలు ప్రభుత్వ పరిధిలో ఉండేవన్నారు. 1995 అనంతరం కార్పొరేట్, ప్రైవేట్ సంస్థల ఆధిపత్యం పెరిగిందని అన్నారు. పాలనలోనూ జోక్యంపై అప్పటి పెట్రోలియం శాఖ మంత్రి జైపాల్ రెడ్డి తొలగింపును ఒక ఉదాహరణగా చెప్పారు. ఆ తర్వాత బాధ్యతలు తీసుకున్న మంత్రి రిలయన్స్ సంస్థకు అనుకూలంగా నిర్ణయాలు చేశారని అన్నారు. 2002లో ఈ ప్రాంతంలో గ్యాస్, చమురు కోసం రిలయన్స్ అనుమతులు తీసుకుందని అప్పటి నుంచి లక్షల కోట్లను ఆర్జించిందని అన్నారు. కానీ ఇక్కడ పర్యావరణ విధ్వంసంతో ఎటూ ఆర్థిక, సామాజిక సమస్యలతో ప్రజలకు నష్టాలను మిగిల్చారన్నారు. మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కేజీ బేసిన్లో గ్యాస్, చమురుపై రాష్ట్ర వాటా కోరుతూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, గవర్నరు తివారీలను కలిసి వినతి పత్రాలను అందజేయటంతో పాటు శాసన మండలిలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు పట్టుబట్టి తీర్మానం చేయించామని గుర్తు చేశారు. తాజాగా యుద్ధం నేపథ్యంలో మరోసారి ఇటువంటి చర్చ ముందుకు వచ్చిందని, ఇప్పటికైనా సాధించుకోవాలన్నారు. గ్యాస్ కొరత నేపథ్యంలో ఇప్పటికే రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ మూత పడిందని అన్నారు. అనేక రంగాలు కుదేలయ్యాయని రాబోయే రోజులలో వ్యవసాయ రంగంపైనా తీవ్ర ప్రభావం పడనుందని హెచ్చరించారు. ఆర్టికల్ 298 సహజ వనరులపై ప్రజల హక్కులను వివరించిందని అన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ తరపున కాకినాడలో త్వరలోనే సదస్సు నిర్వహిస్తామని, బుక్లెట్ కూడా విడుదల చేస్తామని తెలిపారు. సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పీ ప్రసాద్ మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా ఈ సమస్యలపై వామ పక్షాలు పోరాడుతున్నాయని, ఎన్నికలలో ఈ డిమాండ్‌ను మేనిఫెస్టోలో పెట్టాలని డిమాండు చేశామని గుర్తు చేశారు. కేజీ బేసిన్లో దేశంలోనే అతి పెద్ద లూటీ జరుగుతోందని అన్నారు. రాష్ట్ర ప్రజల హక్కుల కోసం ఈ పోరాటానికి గోదావరి జిల్లాలు దారి దీపం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగారు రావు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలను ప్రశ్నిస్తే పాలక ప్రభుత్వాలు సహించలేకపోతున్నాయని అన్నారు. విశాఖ జిల్లాలో సీపీఎం నేత అప్పలరాజుపై పీడీ యాక్ట నమోదు చేయటం ఉదాహరణగా చెప్పారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మోదీ పాలనలో ప్రజలు జీవించే హక్కును కాలరాస్తున్నారని అన్నారు. సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నారని అన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ సుందర రామరాజు, సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎంఎస్ నాగరాజు, ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బీ పవన్ సదస్సులో అతిథులకు స్వాగతం పలికారు. సీపీఐ జిల్లా నాయకుడు కే రాంబాబు వందన సమర్పణ చేశారు.

# నేను జనగణనలో పాల్గొన్నా.. మరి మీరు..

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 16:** దేశ వ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభమైన జనగణన-2027 ప్రక్రియలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా పాల్గొని తొలి అడుగు వేశారు. గురువారం రాజమహేంద్రవరంలోని తన నివాసంలో మండల అధికారుల సమక్షంలో తన కుటుంబ వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేశారు. వివరాల నమోదు పూర్తయిన అనంతరం వాటిని క్షుణ్ణంగా సరిచూసుకుని, ప్రక్రియ విజయవంతంగా ముగియడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు.



ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిపాలనలో జనగణన అనేది అత్యంత ప్రధానమైన అంశమన్నారు. రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారం మారుతున్న జనాభా ప్రాతిపదికన ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించడమే ప్రజా ప్రభుత్వాల లక్ష్యమని తెలిపారు. దేశంలో స్త్రీలు, పురుషులు, పిల్లలు.. ఇతరుల సంఖ్య ఖచ్చితంగా తెలిసినప్పుడే ప్రభుత్వం సరైన అభివృద్ధి, సంక్షేమ పథకాలను రూపొందించడానికి వీలవుతుందని ఆయన వివరించారు. ఈ నెల 16 నుండి 30వ తేదీ వరకు ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' అవకాశం ఉందని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మే 1వ తేదీ నుండి ఎన్యూమరేటర్లు నేరుగా ఇంటింటికి వచ్చి వివరాలు సేకరిస్తారని, ఆ సమయంలో అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు.

"నేను జనగణనలో పాల్గొని నా వివరాలను నమోదు చేసుకున్నాను.. మీరు కూడా ఉత్సాహంగా పాల్గొనండి" అని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ వివరాలను నమోదు చేయించటం ద్వారా దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని, తద్వారా రాబోయే తరాలకు మెరుగైన ప్రణాళికలు అందేలా చూడాలని ఆయన కోరారు.

# జలధారతో భూగర్భ జలాల పెంపు దిశగా సమగ్ర కార్యాచరణ

**- మొదటి పేజీ తరువాయి** స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, జిల్లా ఆదాయ అధికారి టీ సీతారామమూర్తి, సాగునీటి విభాగం సూపరింటెండింగ్ ఇంజనీర్ జీ శ్రీనివాసరావు, ప్రధాన ప్రణాళికాధికారి ఎల్ అప్పలకొండ, జిల్లా భూగర్భ జలాలు అధికారి వై శ్రీనివాస్, జిల్లా నీటియజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఏ నాగమహేశ్వరరావు, పీ వీణాదేవి, ఏ సిల్వా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జలధార కార్యక్రమం ద్వారా భూగర్భ జలాల స్థాయిని పెంపొందించే దిశగా అధికారులు క్షేత్ర స్థాయిలో సమగ్ర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెరువుల పరిశీలనను విస్తృతంగా నిర్వహించి, జిల్లాలో ఉన్న 863 చెరువులు, సాగునీటి ట్యాంకుల ప్రస్తుత పరిస్థితి, గత ఐదేళ్లలో నీటి నిల్వలు, నీరు లేని చెరువుల వివరాలు సేకరించి నివేదిక రూపంలో సమర్పించాలని స్పష్టం చేశారు. భూగర్భ జలాల పెంపు కోసం నీరు నేలలోకి చొరబడే ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. చెరువులను నింపే ప్రక్రియలో గ్రామ స్థాయిలో సాగునీటి, వ్యవసాయ, తోటల శాఖలు, నీటి వినియోగదారుల సంఘాలు, రైతుల అనుభవాలను పరిగణలోకి తీసుకుని సమగ్ర సమాచారం సేకరించాలన్నారు. ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలు, అడ్డంకులు కూడా నివేదికలో ప్రతిబింబించాలన్నారు.

ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న చెరువులతో పాటు ప్రస్తుతం లేని చెరువుల వివరాలు కూడా గుర్తించి నమోదు చేయడం అత్యంత కీలకమన్నారు. చెరువుల చరిత్ర, నీరు చేరే మార్గాలు, పరంపరగా అనుసంధానమైన చెరువులు, వాగులు, వంకలు, అడవి ప్రాంతాల శు భ్రపరిచే పనులు, చెరువుల బండల బలపరిచే చర్యలు వంటి అంశాలను సమగ్రంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టవచ్చిన పనుల వివరాలు కూడా అందించాలని సూచించారు.

ఈ అన్ని వివరాలను నిర్దిష్ట నమూనాలో వ్యాఖ్యలతో సహా సమర్పించాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లాలో భూగర్భ జలాల వాస్తవ పరిస్థితిపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అందజేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. పునఃసర్వే కార్యక్రమంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. భూముల సరిహద్దుల నిర్ధారణలో ఖచ్చితత్వం సాధించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పునఃసర్వే పనులను వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. గ్రామ స్థాయిలో భూ వివాదాల పరిష్కారానికి ఇది కీలకమని చెబుతూ, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి పునఃసర్వే ప్రక్రియను సమయపాలనతో పూర్తి చేయాలని ఆదేశించారు. భూ రికార్డుల నవీకరణ, పారదర్శకత పెంపు, ప్రజలకు సులభ సేవలందించడంలో పునఃసర్వే ముఖ్యపాత్ర పోషిస్తోందని స్పష్టం చేశారు.

# బరియల్ గ్రౌండ్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలి




రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 16: క్రైస్తవుల సమాధి కార్యక్రమాల నిమిత్తం రాజమండ్రి రూరల్ ధవళేశ్వరంలో ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ కు ప్రహరీ గోడ నిర్మించాలని రాజమండ్రి అర్బన్, రూరల్ పాస్టర్ అసోసియేషన్, క్రిస్టియన్ బరియన్ గ్రౌండ్ అడ్వైజరీ కమిటీ, పాస్టర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో తీర్మానించారు. గ్రౌండ్ ఇంచార్జ్, పాస్టర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు పొన్నమాటి బాబ్జి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. బరియల్ గ్రౌండ్ చుట్టు ప్రక్కల నివాస ప్రాంతాలైన రెవెన్యూ కాలనీ, సావిత్రి నగర్, టిడ్కో గృహాలకు సమస్యలు లేకుండా బరియల్ గ్రౌండ్ చుట్టూ ప్రహరీగోడ నిర్మించాలని టీడీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామి ద్వారా స్థానిక ఎమ్మెల్యేకు, రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించామన్నారు. బరియల్ గ్రౌండ్‌లో మౌలిక సదుపాయాలు, సీసీ రోడ్లు, విద్యుత్తు దీపాలు, మంచినీటి బోరు కల్పించాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జాయింట్ యాక్షన్ కమిటీ గోడి మోజెస్, బిషప్ టీ ఆర్డర్ ప్రసాద్, బిషప్ టీ రాజేంద్రప్రసాద్, రెవ డాక్టర్ పైడిమళ్ళ సుందరరాజు, రెవ పీ ఎర్నెస్ట్ మోజెస్, బిషప్ ఎం సాల్మన్ జార్జ్, బిషప్ ఫ్రాన్సిస్, రెవ యంపా ప్రభాకర్, బ్రదర్ కే శాంతారావు, రెవ బీ ఏలియా, బ్రదర్ గెల్లా విజయ కుమార్, రెవ బీ జార్జి పీటర్, రెవ ఎస్ ప్రకాశం, రెవ ఎం మానుకొండ సుధాకరరావు, రెవ డాక్టర్ జీ డేనియల్ విల్సన్, రెవ మేడిద విజయ్ కుమార్, రెవ మందా రాజు, గెద్దం వెంకటరత్నం, రెవ ఆరుగుళ్ళ రాజ్ కుమార్, రెవ ఎం మోహన్‌రావు, రెవ పులగుర్త శ్యామ్ కిల్లీ కుమార్, ఉల్లంపర్తి శామ్యూల్, ప్రొఫెసర్ ఎం జాషువా కిరణ్, బ్రదర్ ఎస్ శాంతారావు, బ్రదర్ విజయ్ ప్రకాష్, ఇంజేటి రాధాకృష్ణ, ఇంజేటి కిషోర్‌కుమార్, రెవ గోడి జాన్, రెవ ఎన్ లాజరు, రెవ పీ పరంజ్యోతి, రెవ చార్లెస్, రెవ వాసంశెట్టి ఆనంద్ కుమార్, రెవ రాచర్ల జాకబ్ పాల్గొన్నారు.

# ఆహా ఆవకాయ సీజన్ 3 విజయవంతం

**-శ్రీ మాంగో చిల్లీ పొడరు, 93.5 రెడ్ ఎఫ్ఎం రేడియో సంయుక్త నిర్వహణలో..**



రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 16: శ్రీ మాంగో చిల్లీ పొడరు, 93.5 రెడ్ ఎఫ్ఎం రేడియో సంయుక్తంగా 'ఆహా ఆవకాయ సీజన్3' కార్యక్రమం నిర్వహించగా అనూహ్య స్పందన లభించింది. స్థానిక జేఎన్ రోడ్డులోని డీ1 కన్వెన్షన్ లో ఘనంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆవకాయ తయారీకి సంబంధించిన సంప్రదాయ పద్ధతులు, రుచులు, ప్రత్యేకతలను అందరికీ పరిచయం చేశారు. ఈ వేడుకకు శ్రీలత హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ ప్రియాంక అనుసూరి ముఖ్య అతిథిగా హాజరై మహిళల ఆరోగ్యం, పోషకాహారం ప్రాముఖ్యత గురించి వివరించారు. శ్రీ మాంగో చిల్లీ పౌడర్ మార్కెటింగ్ మేనేజర్ దిలీప్ , సేల్స్ టీమ్ మోహన్, రవి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. 93.5 రెడ్ ఎఫ్ఎం టీమ్ సభ్యుల సహకారంతో "ఆహా ఆవకాయ సీజన్3" కార్యక్రమం విశేష స్పందనతో విజయవంతమైంది.

# చేపల మార్కెట్ ను సందర్శించిన కమిషనర్ రాహుల్ మీనా



రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 16: చేపల మార్కెట్ లో కొనుగోలుదారులు, అమ్మకపుదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు సౌకర్యాలు కల్పించాలని అధికారులను కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. నగరంలోని 32వ వార్డు జాంపేట ఫిష్ మార్కెట్ ను రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి గురువారం ఉదయం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విక్రయదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్లాబ్, ఫ్లోర్ సహా మరమ్మతులకు సంబంధించి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని.. పరిష్కరించేందుకు ఎల్ల వేళలా తాను సిద్ధమని ఈ సందర్భంగా తెలియజేశారు. అలాగే ఫిష్ మార్కెట్ లో వ్యర్థాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని విక్రయదారులకు సూచించారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ ఎస్ వెంకటరమణ, ఎస్ఈ రీటా, రెవెన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, ఎంహెచ్ఓ వినూత్న, డీఈ సత్యనారాయణ ఇతర సిబ్బంది ఉన్నారు.

# కందుకూరికి జనసేన నేత శ్రీనివాస్ నివాళి



రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 16: సంఘ సంస్కర్త, రచయిత, కందుకూరి వీరేశలింగం 178వ జయంతి సందర్భంగా రాజమహేంద్ర వరం నగరంలోని ఆనంద గార్డెన్స్ ప్రాంగణంలో ఉన్న కందుకూరి వీరేశలింగం దంపతుల సమాధి వద్ద పూలు సమర్పించి జనసేన పార్టీ రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు వై శ్రీనివాస్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం సమాజంలో ఉన్న సామాజిక దురాచారాలపై పోరాడిన మహానుభావుడని కొనియాడారు. సతీ సహగమనాన్ని వ్యతిరేకించి వితంతు పునర్వివాహాలను జరిపించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. మహిళా విద్యకు ప్రాధాన్యం ఇచ్చి, సామాజిక అభ్యున్నతికి మార్గదర్శకుడిగా నిలిచిన మహనీయుడన్నారు. ఆయన సాహిత్య రచనలు ప్రజల్లో చైతన్యం కలిగించడంలో కీలక పాత్ర పోషించాయని, వివేకవర్ధిని పత్రిక ద్వారా సమాజంలో చైతన్యం కలుగజేశారన్నారు. సమానత్వం, విద్య, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. హితకారిణి సమాజం స్థాపించి విద్యాభివృద్ధికి, సమాజ హితానికి తన యావదాస్తిని దానం చేసిన గొప్ప వ్యక్తి అని ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ఎండోమెంట్ చైర్మన్లు, డైరెక్టర్లు, జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.



## కందుకూరి ఆశయాలు
# నేటి సమాజానికి ఆదర్శం

**-మాజీ ఎమ్మెల్సీ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు**

రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 16: కందుకూరి ఆశయాలు నేటి సమాజానికి చాలా అవసరమని మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక కోటిపల్లి బస్టాండు దగ్గర గురువారం కందుకూరి వీరేశలింగం జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ అజ్ఞానం, మూఢ నమ్మకాలు, అశాస్త్రీయత అలుముకున్న రోజుల్లో వీరేశలింగం చైతన్య సూర్యుడిలా సమాజానికి ఉపయోగపడే ఎన్నో కార్యక్రమాలు చేశారన్నారు. నవయుగ వైతాళికుడు కందుకూరి ఆశయాలు ప్రజలందరికీ చేరాలన్నారు. ఇవాల్టికీ లింగ వివక్షత, మూఢ నమ్మకాలు వంటి సమస్య సమాజంలో తాండవిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు పీ అరుణ్, ఎస్ఎఫ్ఐ నాయకుడు పవన్ భాస్కర్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఏఎస్ఓ పోస్టుకు దరఖాస్తు చేసేందుకు
# గడువు పొడిగింపు

**- అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్ సుభాషిణి**



రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 16: తూర్పు గోదావరి జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్ఓ) పోస్టు భర్తీకి స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు దరఖాస్తుల సమర్పణ తేదీని మరో మూడు రోజులు పొడిగించినట్లు అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్ సుభాషిణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా 'జిల్లా ప్రాజెక్టు కార్యాలయం, సమగ్ర శిక్ష, రాజమహేంద్రవరం చిరునామాకు పంపాలన్నారు. నోటిఫికేషన్, దరఖాస్తు నమూనా, నియమావళికి ఎంఈఓలు, సమగ్ర శిక్ష, జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయాల్లో సంప్రదించ వచ్చని తెలిపారు. దరఖాస్తులను ఎస్ఎస్ఆర్ జేవైఓఆర్‌జీ వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మరింత సమాచారానికి 9866 77 9398 నెంబరులో సంప్రదించాలని సుభాషిణి సూచించారు.

# నేడే కలెక్టరేట్ లో ఉద్యోగుల గ్రీవెన్స్..

**- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్**



కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 16.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెలా 3వ శుక్రవారం నిర్వహించే ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం ఈ నెల 17వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకూ కాకినాడ కలెక్టరేట్ లోని ప్రజావాణి హాలులో నిర్వహించడం జరుగు తుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు ఈ అంశాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులు మధ్యాహ్నం 3. 45 గంటలకే ఈ కార్యక్రమానికి హాజరు కావాలని జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు.

## సెన్సస్ 2027
## సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రారంభం

**- గురువారం ప్రారంభమైన స్వీయ నమోదు**
**- నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలి**
**- 7 సులభ దశల్లో ఆన్‌లైన్ నమోదు అవకాశం**
**- 33 రకాల ప్రశ్నలు**
**- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 16:** తూర్పు గోదావరి జిల్లాలో సెన్సస్2027లో భాగంగా స్వీయ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని, వారి వివరాలతో పాటుగా కుటుంబ సభ్యులు వివరాలు కూడా నమోదు చేసుకోవాలనీ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రజలు స్వచ్ఛందంగా..పోర్టల్ ద్వారా ఈ నెల 30 వరకు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 16 నుంచి 30 వరకు 15 రోజుల అవగాహన ప్రచార, స్వీయ నమోదు కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. ప్రతి రోజు వేర్వేరు వర్గాల ప్రజలను చేరుకునేలా కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా రోజుకు కనీసం 10 నుండి 20 మంది వరకు స్వీయ నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. ఇంటింటి ప్రచారం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలని, ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.
సెన్సస్ ప్రక్రియను మరింత ఖచ్చితత్వంతో, వేగంగా పూర్తి చేయడంలో స్వీయ నమోదు కీలకమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎక్కువ మంది ప్రజలు స్వచ్ఛందంగా నమోదు చేసుకునేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.

**స్వీయ నమోదు ప్రక్రియ ఎలా?..**
సెన్సస్2027లో భాగంగా ప్రతి కుటుంబం ఇంటి నుంచే వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవచ్చు. మొబైల్ నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసి, ఓటీపీ ద్వారా ధృవీకరణ అనంతరం లాగిన్ అయి కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా వంటి సమాచారం నమోదు చేసి సబ్మిట్ చేయాలి. నమోదు పూర్తయ్యాక వచ్చే రిఫరెన్స్ నెంబర్‌ను భద్రంగా ఉంచాలి.

**జనాభా లెక్కలు 2027 :**
**ఫేజ్1 ఇళ్ల జాబితా సేకరణలో అడిగే ప్రశ్నలు..**
ఇందులో ఇంటి నెంబరు, జనగణన జాబితా సంఖ్య, ఇంటి నిర్మాణంలో వాడిన ఫ్లోర్, గోడలు, పైకప్పు మెటీరియల్, ఇంటి వినియోగం (నివాస, వాణిజ్య, పారిశ్రామిక లేదా ఖాళీ), ఆవాసయోగ్యత, కుటుంబ సభ్యుల సంఖ్య, ప్రస్తుతం నివసిస్తున్న వారి సంఖ్య, ఇంటి పెద్ద పేరు, లింగం, సామాజిక వర్గం, ఇల్లు సొంతమా అద్దెనా, గదుల సంఖ్య, పెళ్లైన జంటల సంఖ్య, తాగునీటి వనరులు మరియు అందుబాటు, విద్యుత్, సోలార్ వినియోగం, మరుగుదొడ్లు, వాటి రకం, డ్రెయినేజీ, బాత్రూమ్ సదుపాయాలు, కిచెన్- వంట ఇంధనం, రేడియో, టీవీ, ఇంటర్నెట్, ల్యాప్టాప్, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్ల సంఖ్య, ద్విచక్ర వాహనాలు, కార్లు, జీపులు, వాన్లు, కుటుంబం ప్రధానంగా వినియోగించే ధాన్యాలు, అలాగే ఫోన్ నెంబర్ వంటి మొత్తం 33 అంశాలపై సమాచారం సేకరించబడుతుంది. ఈ వివరాలు సమగ్ర జనాభా గణాంకాల సేకరణకు కీలకంగా ఉపయోగ పడతాయి.

**సెన్సస్ 2027 అవగాహన ప్రచార కార్యక్రమం స్వీయ నమోదు షెడ్యూల్..**
సెన్సస్2027 స్వీయ నమోదు కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడానికి ఏప్రిల్ 16 నుండి 30 వరకు ప్రత్యేక షెడ్యూల్ రూపొందించబడింది. ఇందులో ఏప్రిల్ 16న ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొనగా, 17న సచివాలయ, జిల్లా, మండల కార్యాలయ సిబ్బంది, 18న ప్రముఖులు, క్రీడాకారులు, కళాకారులు, 19న మహిళా సంఘాలు, 20, 30 తేదీలలో కార్మికులు, 21న గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, 22న పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలు, 2324 తేదీలలో ఆంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు, గిరిజన ప్రాంతాలు, 25న రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్, 26న వృద్ధాశ్రమాలు "సెన్సస్ 5కే రన్", 27న దుకాణాలు, పరిశ్రమలు, 28న బ్యాంకులు, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు రెండో దశ, 29న పోలీసు సిబ్బంది వంటి వర్గాలను లక్ష్యంగా చేసుకుని ప్రతిరోజు ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహించబడతాయి.

# అగ్నిప్రమాదాల నివారణపై అవగాహనా ర్యాలీ

**- అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా విస్తృత అవగాహనా కార్యక్రమాలు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 16:** దేశ, రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా తూర్పు గోదావరి జిల్లాలో పలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం అగ్నిమాపక కేంద్రం నుండి గోకవరం బస్టాండు సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అగ్నిమాపక శాఖ అధికారులతో పాటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు, ప్రమాదం సంభవించినపుడు అనుసరించాల్సిన చర్యలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ఈ ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని ప్రాంతీయ అగ్ని మాపక అధికారి ఈ స్వామి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వారం రోజుల పాటు గృహ సముదాయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు, పరిశ్రమలు, పెట్రోల్ బంకులు, ఎల్పీజీ అవుట్‌లెట్లు తదితర ప్రాంతాలలో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏప్రిల్ 14న అగ్నిప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన అమరులకు నివాళులు అర్పించడంతో ఈ కార్యక్రమాలు ప్రారంభ మయ్యాయన్నారు. అదే విధంగా అగ్నిప్రమాదాలు మాత్రమే కాకుండా ఇతర విపత్తుల సమయంలో కూడా ప్రాణ నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అగ్నిమాపక శాఖ ద్వారా ముద్రించిన అవగాహనా కరపత్రాలను బహుళ అంతస్తుల భవనాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలలో ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. ఇటీవల జరిగిన బస్సు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని రవాణా శాఖతో సమన్వయం చేస్తూ ఆర్టీసీ, ప్రైవేట్ ట్రావెల్ బస్సుల్లో ప్రయాణికులకు ఆడియో సందేశాల ద్వారా రక్షణ మార్గాలు, ప్రమాద సమయాల్లో అనుసరించాల్సిన చర్యలపై అవగాహన కల్పించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు.
అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి అగ్నిమాపక కేంద్రం, ఆర్యాపురం వరకు మరో అవగాహనా ర్యాలీ నిర్వహించామన్నారు. ఈ ర్యాలీలో మైక్ ద్వారా అగ్నిమాపక జాగ్రత్తలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. సుమారు 200 మంది ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు. ఈ ర్యాలీని ప్రాంతీయ అగ్నిమాపక అధికారి (జోన్-2) ఎం స్వామి ప్రారంభించగా, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి పేరూరి శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వైసీపీ బలోపేతానికి కృషి చేయాలి

**- వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా సేపేని మునీశ్వరరావు**
**- వైఎస్సార్ టీయూసీ సిటీ ప్రెసిడెంట్ గా దాది గౌరీశంకర్ - వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షులుగా పలువురు నియామకం**
**- వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి, రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్**




**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 16:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ హోదాలలో నియమించిన వారికి నియామక పత్రాలు అందించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ గురువారం కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు వార్డులలో అధ్యక్షులను నియమించారు. జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా సేపేని మునీశ్వరరావును, వైఎస్సార్ టీయూసీ సిటీ ప్రెసిడెంట్ గా దాది గౌరీశంకర్ ను నియమించారు. అలాగే 6వ డివిజన్ అధ్యక్షుడిగా నల్ల రామాంజనేయులును, 24వ డివిజన్ అధ్యక్షుడిగా ఎజ్జవరపు శ్రీనివాసరావును, 25వ డివిజన్ అధ్యక్షుడిగా రొక్కం త్రినాథ్ ను, 51 డివిజన్ అధ్యక్షుడిగా గుత్తుల కోటేశ్వరిని నియమించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలే ఉపేతానికి కృషి చేయాలని అన్నారు. వచ్చే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో క్రింది స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కార్పొరేషన్ లో జెండా ఎగరవేసేలా కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీని బలోపేతం చేసే దిశగా అందరికీ బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో, వార్డులలో సమర్థవంతంగా పనిచేసి పార్టీ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. గతానికి భిన్నంగా వార్డు స్థాయిలో డెమోక్రటిక్ విధానంలో కమిటీల ఏర్పాటు చేపట్టడం ద్వారా సభ్యుల్లో నాయకత్వ లక్షణాలు పెంచాలని తెలిపారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని తెలిపారు. రానున్న రాజమండ్రి కార్పొరేషన్ ఎన్నికలలో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుదామని మాజీ ఎంపీ భరత్ పిలుపునిచ్చారు.

# జీవనోపాధికి ప్రణాళిక రూపొందించుకోవాలి

**- డిఆర్డిఏ ఏపీఎం**




**పి గన్నవరం 16 మనసులోమాట:** బ్యాంకుల ద్వారా రుణాలను పొందే ఎస్ హెచ్ జి గ్రూప్ సభ్యులు జీవనోపాధికి ప్రణాళికను రూపొందించుకోవాలని డిఆర్డిఏ ఏపీఎం వి వెంకటరమణ సూచించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం మహిళా సామర్థ్య కార్యాల యంలో గురువారం వివో ఏలు, సీఆర్పీలు ఆర్టిలు వివో ఓ బి లకు వార్షిక ప్రాణాలిక తయారీపై గురువారం అవగాహన కల్పించారు. సందర్భంగా డి ఆర్డిఎ ఏపీఎం మాట్లాడుతూ బ్యాంకులు స్త్రీ నిధి ఉన్నత విడత మార్గాల ద్వారా పొందే రుణాలతో జీవనోపాధి పొందాల న్నారు. పెట్టుబడి ప్రాణాలిక రూపొందిం చుకొని, తరువాత రుణాలు పొంది వాటి పెట్టుబడులు పెడుతూ అధిక ఆదాయా న్ని పొందే మార్గాలను అన్వేషించాల న్నారు. సమావేశంలో సీసీలు గంధం శ్రీవాణి, ఎస్ ఆనంద్, అకౌంటెంట్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



### జల్దం గ్రామంలో
# మంచినీటి సమస్య తీర్చండి
### - మాజీ సర్పంచ్ జగ్గారావు వినతి

**రౌతులపూడి, (మనసులో మాట) ఏప్రియల్ 16:** మండలంలోని గిరిజన ప్రాంతమైన జల్దం గ్రామంలో మంచినీరు రాక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు రాకపోవడంతో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జల్దం గ్రామానికి మంచినీరు వచ్చేలా ఏర్పాటు చేయాలని వారు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ జగ్గారావు మాట్లాడుతూ జల్దం గ్రామంలో మంచినీళ్లు రాక చాలా ఇబ్బందులకు గురి అవుతున్నామని అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని వేసవి కాలం లో మరింత నీటి సమస్య ఏర్పడుతుందని ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి మంచి నీటిని ఏర్పాటు చేయాలని జగ్గారావు కోరారు. ఈ కార్యక్రమంలో జల్దం గ్రామస్తులు పాల్గొన్నారు.

# వేములమ్మ అమ్మవారికి సారి సమర్పించిన గ్రామ మహిళలు



**రౌతులపూడి, (మనసులో మాట) ఏప్రియల్ 16:** రౌతులపూడి గ్రామ దేవత అయిన శ్రీశ్రీ పెద్ద వేముల తల్లి చిన్న వేముల తల్లి అమ్మవారి జాతర మహోత్సవ సందర్భంగా అమ్మవార్లకు రౌతులపూడి ఆడపడుచులు సారె సమర్పించారు. అనంతరం అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ పెదవేములమ్మ చిన్నవేములమ్మ తల్లి శుక్రవారం నాడు అంగరంగ వైభవంగా జరపడుతుందని కనుక భక్తులు ప్రతి ఒక్కరూ పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కమిటీ వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇట్టం శెట్టి సూర్య భాస్కర్ బాబు, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

### మారేడుమిల్లి మండలంలో
# గొర్ర గేది దాడిలో వ్యక్తి మృతి



**రంపచోడవరం మనసులో మాట ఏప్రిల్ 15..** మారేడుమిల్లి మండలం కొత్తలూరు గ్రామానికి చెందిన ఆదిరెడ్డి (42 ) గురువారం గొర్ర గేదె దాడిలో మృతి చెందాడని సీఐ ప్రసాద్ తెలిపారు. కొండ సమీపంలో గల తన జాప్ర తోటలో పనిచేస్తుండగా అడవి దున్న దాడి చేయడంతో స్పాట్లోనే మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. మృతదేహాన్ని తరలించి సంఘటన స్థలాన్ని పరిశీలించామన్నారు. మారేడుమిల్లి మండలంలో గొర్ర గేదెలు మందలు మందలుగా సంచరిస్తున్నాయని రైతులు గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి

### - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి 64 లక్షల టన్నుల ఆక్వా ఉత్పత్తులు అందిస్తున్న రైతులకు ప్రత్యేక ధన్యవాదాలు
### - కేంద్ర ఫిషరీస్, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమల మంత్రిత్వ శాఖ సెక్రటరీ డా. అభిలక్ష్ లిఖీ




**భీమవరం, (మనసులో మాట) ఏప్రిల్ 16 :** పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "బ్రాకిష్ వాటర్ ఆక్వాకల్చర్ క్లస్టర్" సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ బిజయ్ కుమార్ బెహన్, రాష్ట్ర వ్యవసాయ మరియు సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశం భీమవరం బ్రాకిష్ వాటర్ ఆక్వాకల్చర్ క్లస్టర్ అభివృద్ధి, రైతుల ఆదాయ వృద్ధి, సుస్థిర సాగు పద్ధతుల ప్రోత్సాహం లక్ష్యంగా నిర్వహించబడింది. ప్రారంభంలో చీఫ్ ఎగ్జిక్యూటివ్ డా. బిజయ్ కుమార్ బెహన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గత ఐదు సంవత్సరాల్లో క్లస్టర్ సాధించిన పురోగతి, ఇంకా చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఈ సందర్భంగా అధికారులు రైతులతో నేరుగా సంభాషించి వారి సమస్యలు, సవాళ్లను తెలుసుకొని తక్షణ పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్లస్టర్ స్థాయిలో రైతులు పరస్పరం సహకరించి సమిష్టి సాగు విధానాలు అనుసరించడం ద్వారా ఉత్పత్తి ఖర్చులు తగ్గించి లాభాలు పెంచుకోవచ్చని సూచించారు.

కేంద్ర సెక్రటరీ డా.అభిలక్ష్ లిఖీ మాట్లాడుతూ ఆక్వాకల్చర్ రంగం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా రొయ్యల సాగులో ఆధునిక సాంకేతికతలను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధ్యమని తెలిపారు. ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్రం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పి ఎం ఎం ఎస్ వై ) కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.2000 కోట్లలో భాగంగా ఇప్పటికే రూ.600 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, అదనంగా రూ.500 కోట్లు బోట్లు, వలలు, ఆధునిక సాంకేతికత, ఇతర కార్యక్రమాలకు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ పథకాన్ని మరో ఐదు సంవత్సరాలు పొడిగించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. దేశీయ మార్కెటింగ్ విస్తరణకు చర్యలు తీసుకుంటామని, మిలటరీ, మిడ్‌డే మీల్స్ వంటి రంగాల్లో ఆక్వా ఉత్పత్తుల వినియోగాన్ని పెంచేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఆక్వా రంగంలో జీఎస్టీ తగ్గింపుపై కూడా చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు విదేశీ ఆక్వా పద్ధతులపై అవగాహన కల్పించేందుకు స్టడీ టూర్లు నిర్వహించే యోచన ఉందన్నారు. ఐస్ ల్యాండింగ్ డైరీ క్లస్టర్లో ఫిష్ లోని అన్ని టిష్యూలను వినియోగిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఐస్ ల్యాండింగ్ తో టైఅప్ పెట్టుకుని ఆక్వా కల్చర్ లో వస్తున్న 16 లక్షల టన్నుల షిశీప్ రద్దును ఎలా సద్వినియోగం చేసుకుంటే బాగుంటుందో ఆలోచన చేస్తామన్నారు. రాష్ట్ర వ్యవసాయ మరియు సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఆధారిత రాష్ట్రమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఆక్వా రంగంలో ఎంతో అభివృద్ధి సాధించింది అన్నారు. జిల్లాలో ఆక్వా రైతులు 83% తమ చెరువులను రిజిస్ట్రేషన్ చేయించు కున్నారని ఇంకను 17% రైతులు తమ చెరువులను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉందన్నారు. ఆక్వా రైతాంగం తమ చెరువులను నూరు శాతం రిజిస్ట్రేషన్ చేయించు కోవాలన్నారు. అలాగే, సబ్సిడీలు, ముఖ్యంగా విద్యుత్ సబ్సిడీ వంటి ప్రభుత్వ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకొని రైతులు తమ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాలని సూచించారు. జిల్లాలో ఆక్వా రంగం విశేష అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో రూపాయి మార్పిడి విలువ ప్రభావంతో రైతులు నష్టపోతున్నారని చెప్పారు. ఉత్పత్తి ఖర్చులను తగ్గించడం ద్వారా మాత్రమే అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ సాధ్యమని స్పష్టం చేశారు. ఫిషరీస్ రంగంలో సాంకేతిక మరియు విధాన సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు శాస్త్రవేత్తల సహకారం అవసరమని తెలిపారు. ఉప ఉత్పత్తులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం ద్వారా ఆదాయాన్ని పెంచే అవకాశాలు ఉన్నాయని సూచించారు. దేశంలో ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నప్పటికీ, అంతర్జాతీయ స్థాయిలో పోటీకి తగిన సామర్థ్యం పెంపు అవసరమని తెలిపారు. రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్ మాట్లాడుతూ, ఆక్వా రైతులకు నాణ్యమైన సీడ్ మరియు ఫీడ్ వినియోగం ప్రాముఖ్యత, నీటి నాణ్యత నిర్వహణ పద్ధతులు, వ్యాధుల నివారణ మరియు నియంత్రణ చర్యలు, మార్కెటింగ్ సదుపాయాలు, ఎగుమతి అవకాశాలు, అలాగే ప్రభుత్వ పథకాల వివరాలు మరియు సబ్సిడీల వినియోగంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఫిషరీస్ రంగంలో దేశవ్యాప్తంగా ప్రముఖ స్థానం సంపాదించిందని, ముఖ్యంగా లైవ్‌స్టాక్ మరియు ఫిషరీస్ రంగాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. భీమవరం ప్రాంతంలో ఆక్వా రంగం పరిశ్రమ స్థాయిలో అభివృద్ధి చెందినప్పటికీ, ఇంకా కొన్ని వ్యవస్థాపక లోపాలు ఉన్నాయని గుర్తించారు. వాటిని సరిదిద్దేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో మెరుగైన ప్రమాణాలు (సర్టిఫికేషన్), నాణ్యత నియంత్రణ, ఆధునిక సాంకేతికతల వినియోగం ద్వారా రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. ఆక్వా చెరువుల నమోదును తప్పనిసరిగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, జిల్లాలో ఆక్వాకల్చర్ రంగ అభివృద్ధికి ఇలాంటి సమావేశాలు నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందు కలెక్టరేట్ ప్రాంగణంలో ఆక్వా ఎక్స్ఛేంజ్ సంస్థ ఏర్పాటు చేసిన ఆధునిక యంత్ర పరికరాల ప్రదర్శనను అధికారులు పరిశీలించారు. పవర్ మాన్, ఏపీ ఎఫ్‌సి, స్మార్ట్ స్టార్టర్, స్టాటిక్ ఫీడర్, ఫీడ్ మిక్సర్, ఆక్వా బోర్డ్ వంటి పరికరాల వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే "కౌంట్ 366" మొబైల్ యాప్ ద్వారా చెరువుల పరిస్థితులను రియల్ టైమ్‌లో పర్యవేక్షించడం, రొయ్యల వ్యాధులను ముందుగానే గుర్తించడం, ఖర్చులను నియంత్రించడం, అధిక దిగుబడులు సాధించడం వంటి అంశాలను నిర్వాహకులు వివరించారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, ఆక్వాకల్చర్ నిపుణులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# పల్లిపాలెంలో పోషకాహార పక్షోత్సవం నిర్వహణ




కాజులూరు (మనసులో మాట) ఏప్రిల్ 16.. పోషకాహార పక్షోత్సవాల సందర్భంగా తాళ్ళరేవు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని పల్లిపాలెం గ్రామం నడింపాలెం అంగన్వాడి సెంటర్లో సెక్టార్ విస్తరణ అధికారి సిహెచ్ నాగలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, ఆరు సంవత్సరాల లోపు పిల్లల తల్లులను సమావేశపరిచి పిల్లల ఆరోగ్య పరిరక్షణపై ముఖ్యమైన సూచనలు అందించారు. పిల్లలకు జంక్ ఫుడ్ లేదా బయట లభ్యమయ్యే చిరుతిళ్లు ఇవ్వడం వల్ల కలిగే దుష్ప్రభావాలను తల్లులకు వివరించారు. అలాంటి ఆహారం వల్ల పోషకాహార లోపం, జీర్ణ సమస్యలు, స్థూలకాయం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. స్థానికంగా లభ్యమయ్యే ఆహార పదార్థాలతోనే ఇంట్లో ఆరోగ్యకరమైన వంటకాలు తయారు చేసి పిల్లలకు అందించవచ్చని డెమో ద్వారా చూపించారు. స్థానిక సెంటర్‌లో ఏర్పాటు చేసిన టీవీ ద్వారా జంక్ ఫుడ్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై వీడియో ప్రదర్శించారు. ఈ వీడియో తల్లుల్లో మరింత అవగాహన పెంచింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్లు యల్లమిల్లి వరలక్ష్మి , సుజాత , కళ్యాణి , లక్ష్మి , శేషారత్నం , లక్ష్మి జి ఎం ఎస్ కే లు నాగలక్ష్మి , సాయి ప్రసునా పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



## పెద్దనపల్లి లో ప్రారంభం అయిన

# జనగణన

**ఏలేశ్వరం (మనసులో మాట) ఏప్రిల్ 16..** ఏలేశ్వరం మండలం పెద్దనపల్లి గ్రామంలో ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి బుజ్జి నివాసం వద్ద గురువారం జనగణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ రామ రాజు వర్మ ప్రారంభించగా, మండల తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది, గ్రామ అధికారులు పాల్గొన్నారు. జనగణన కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజల వివరాలను సేకరించి ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడు తుందని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

## 18న మార్గాని ఎస్టేట్స్ లో

# జాబ్ మేళా

- **నిరుద్యోగ యువత కోసం 25 కంపెనీల ఇంటర్వ్యూలు**
- **ఈ అవకాశం సద్వినియోగం చేస్తుకోవాలని మాజీ ఎంపీ భరత్ విజ్ఞప్తి**
- **జాబ్ మేళా నిరంతర ప్రక్రియగా స్పష్టీకరణ**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 16:** ఈ నెల 18వ శనివారం స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ జాతీయ అధికార ప్రతినిధి, రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ రహిత రాజమండ్రి లక్ష్యంగా..మన రాజమండ్రి పార్లమెంట్ నిరుద్యోగ యువత కోసం జనవరి నెలలో సుమారు 75 కంపెనీలతో మంజీరా కన్వెన్షన్ లో మెగా జాబ్ మేళా నిర్వహించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మెగా జాబ్ మేళా ద్వారా 500 మందికి పైగా నిరుద్యోగ యువతి, యువకులకు వివిధ రంగాల ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగాలు కల్పించినట్లు, ఈ జాబ్ మేళాలు నిరంతరం జరిగే ప్రక్రియగా ఆ రోజు ప్రకటించామని ఆయన గుర్తు చేశారు. అందులో భాగంగానే ఇప్పుడు రెండో జాబ్ మేళా సుమారు 25 కంపెనీలతో వందలాది ఉద్యోగ అవకాశాలతో 18వ తేదీ శనివారం ఉదయం 9గంటల నుండి నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ భరత్ తెలిపారు. జాబ్ మేళా పోస్టర్ లోని క్యూఆర్ కోడ్ ని స్కాన్ చేసి రిజిస్టర్ చేసుకుని జాబ్ మేళాలో పాల్గొనవచ్చని, లేదంటే నేరుగా జాబ్ మేళాకి వచ్చి అక్కడ కూడా రిజిస్టర్ చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఈ జాబ్ మేళాలో మాన్యుఫాక్చరింగ్, బీపీఓ, బ్యాంకింగ్, ఫార్మా, ఈ-కామర్స్ లాంటి రంగాలకు సంబంధించిన 25 కంపెనీలు నిరుద్యోగ యువతీ, యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఆఫర్ లెటర్ లు అందిస్తాయని ఆయన ప్రకటించారు. కావున ఈ అవకాశాన్ని రాజమండ్రి నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని మాజీ ఎంపీ భరత్ కోరారు.

## జిల్లావ్యాప్తంగా 10 లక్షల మెట్రిక్ టన్నులు

# భవన నిర్మాణ రంగాలకు నిల్వలు చేయాలి - కలెక్టర్



**అమలాపురం మనసులోమాట ఏప్రిల్ 16:** వర్షాకాల సీజన్లో భవన నిర్మాణ రంగానికి ఎటువంటి అసౌకర్యం కల గకుండా జిల్లా వ్యాప్తంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గురువారం స్థాని కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కమిటీ సభ్యు లతో చైర్మన్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యా ప్తంగా రుతుపవనాల సీజన్ వర్షాకాలంలో సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నులు భవన నిర్మాణ రంగా అవసరాలకు నిల్వలు చేయాలని ఆదేశించారు. జొన్నాడ ఇసుక స్టాక్ పాయింట్ వద్ద 1 . 5 లక్షలు మెట్రిక్ టన్నులు, కపిలేశ్వ రపురంలో 1 లక్ష మెట్రిక్ టన్నులు, రావులపాడు వద్ద నాలుగు లక్షలు, ఆల మూరు నందు రెండు లక్షలు మెట్రిక్ టన్నులు నిల్వలు ఉంచాలన్నారు. ఐదు మాన్యువల్ ఇసుక రీచులకు టెండర్లు ఖరారుకు గుత్తేదారులు రానందున వాటిని సెమీ మేకనైజ్డ్ రీచ్యువల్ గా మార్చి టెండర్లు పిలవాలన్నారు. పట్టా భూములలో ఇసుక త్రవ్వకాలు సంబంధించి పనులను వేగవంతం చేయాలన్నారు. టాస్క్ ఫోర్స్ టీములు నియ మించి వారంలో కనీసం ఒకసారి తనిఖీ చేసేందుకై చర్య లు గైకొనాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. ప్రజలు కూడా అక్రమ రవాణా గురించి సమాచారం అందించి ప్రభుత్వానికి సహకరించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణ రంగ డిమాండుకు అనుగుణం గా ఇసుక పారదర్శకంగా సరఫరా కావాలని సూచించారు .ఈ సమావేశంలో జిల్లాలో ఇసుక లభ్యత, సరఫరా మరియు అక్రమ రవాణా నిరోధానికి తీసుకో వాల్సిన చర్యలపై కమిటీ సభ్యులతో చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. నిరంతర పర్య వేక్షణ లో భాగంగా జిల్లా లోని అన్ని ఇసుక రీచ్‌లలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం తవ్వకాలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశిం చారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించిం దన్నారు. ప్రభుత్వం నిర్ణ యించిన ధరలకే వినియో గదారులకు ఇసుక అందే లా చూడాలని, ఎక్కడైనా అధిక ధరలకు విక్రయిస్తే సీజ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని అక్రమంగా ఇసుకను తరలించే వాహనాలపై నిఘా ఉంచేందుకు జిల్లా సరిహద్దుల్లోనూ, ప్రధాన రహదారుల్లోనూ చెక్ పోస్టులను బలోపేతం చేయాలని పోలీసు మరియు రెవెన్యూ శాఖలకు సూచించారు.

వర్షాకాలం దృష్ట్యా ఇసుక కొరత రాకుండా ముందస్తుగా స్టాక్ పాయింట్లలో తగినంత నిల్వలు ఉంచేం దుకు సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. ఇసుక రవాణా చేసే వాహనాలు తప్పనిసరిగా అనుమతు లు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవ స్థను అనుసంధానం చేయాలని నిర్ణయించారు ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు జి మమ్మీ పి భాగ్యవతి, డిటిఓ డి శ్రీనివాసరావు భూగర్భ గనుల శాఖ ఏడి బి అశోక్ కుమార్ జల వనరుల శాఖ డి ఈ సుబ్బారావు, ఆర్ అండ్ బి ఎస్ సి బి రాము, డిపిఓ శాంత లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎంపీడీవో

**- తుంగమడుగులలో ఉపాధి కూలీలు నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించిన ఎంపీడీవో**



**మనసులో మాట రంపచోడవరం ఏప్రిల్ 15..** వికసిత భారత గ్యారంటీ ఫర్ రోజు గర్ అండ్ అజీవ్ క మిషన్ గ్రామీణ వీబీ జి రామ్ జి సిబ్బంది తో ,ఏపీడీ ఎల్ . రాంబాబు సమక్షంలో సిబ్బందిని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నాడు రివ్యూ చేయటం జరిగింది. గ్రామాలలో ఉపాధి శ్రామికుల హాజరు పెంచాలని , ఎన్ .ఎన్. ఎమ్ ఎస్. ఎం.ఎస్. ద్వారా ఫేస్ అటెండెన్స్ చేయించాలని ప్రతీ 20 మందికి ఒక మేట్ ను ఏర్పాటు చేయాలని సమావేశం లో తెలియచేయడం జరిగింది మరియు జలధార ద్వారా గుర్తించిన పనులను క్లార్ట్ అప్ ద్వారా గుర్తించి , యుక్తదార ద్వారా అంచనాలను తయారుచేసి పరిపాలన ఆమోదం కొరకు పంపాలని టాస్క్ 'కి సూచించడమైనది. అలసత్వం వహించిన సిబ్బంది పై చర్యలు తీసుకొనబడతాయి అని ఆదేశించడమైనది.

ఈ సమావేశానికి ఫీల్డ్ అసిస్టెంట్స్ టెక్నికల్ అసిస్టెంట్. జే ఇ కంప్యూటర్ ఆపరేటర్స్ ,ఏపీవో బి చిరంజీవి రావు హాజరు కావటం జరిగింది.

తుంగమడుగులలో ఉపాధి కూలీలతో చేపట్టిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను ఫీల్డ్ లోకి వెళ్లి పరిశీలించిన ఎంపీడీవో అడ్డతీగల మండలం తుంగమడుగులు పంచాయతీ గండి వీధిలో ఉపాధి కూలీలతో నిర్మాణ పనులు చేపట్టిన వాటర్ ట్యాంక్ పనులను గురువారం ఉదయం ఎంపీడీవో ఏవివి కుమార్ ఫీల్డ్ లోకి వెళ్లి ఉపాధి కూలీలు చేస్తున్న పనులను పరిశీలించారు. వారికి ఫీల్డ్ అసిస్టెంట్లకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు ఉపాధి హామీ పనులను బాయ్ కట్ చేసిన డొక్కాపాలెం గ్రామస్తులు

అడ్డతీగల పంచాయతీ డొక్కాపాలెం గ్రామస్తులు వారు గత 45 రోజులుగా చేసిన కూలి డబ్బులు వారి బ్యాంక్ అకౌంట్ లో జమ కాకపోవడంతో వాటికి నిరసనగా 45 రోజులు పాటు కూలి డబ్బులు రాకపోతే ఎలా బ్రతికేదని అధికారులు అది గమనించవలసిన విషయమని డొక్కాపాలెం గ్రామానికి చెందిన గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పశువులు దాహార్తి తీర్చే నీళ్ల తొట్టెల కోసం తాము పెట్టిన పెట్టుబడి ఇప్పటికి మంజూరు కాలేదని అప్పు చేసిన డబ్బులకు వడ్డీలు కట్టలేక పోతున్నామని డొక్క పాలెం గ్రామానికి చెందిన సత్తిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశాడు. ఇకనైనా అధికారులు స్పందించి తాము చేసిన పనులకు డబ్బులు పడేలా చర్యలు తీసుకోవాలని అలాగే నీళ్ల తొట్టెలకు పెట్టిన డబ్బులు మంజూరు అయ్యేలా చూడాలని డొక్క పాలెం అనిగేరు గ్రామాలకు చెందిన గిరిజనులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రోడ్లతో అభివృద్ధి నిర్వహణ సాధ్యం

**- గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లకే ప్రాధాన్యత ఇవ్వాలి**

**- పిఏసి సమావేశంలో అర్ అండ్ బి అధికారులతో చర్చించిన పిఏసి చైర్మన్ ఎమ్మెల్యే అంజిబాబు**



భీమవరం, (మనసులో మాట) ఏప్రిల్ 16 : రోడ్లతో అభివృద్ధి నిర్వహణ సాధ్యమవుతుందని, రోడ్లలో నిర్లక్ష్యం వద్దని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. విజయవాడలో గురువారం జరిగిన పిఏసి సమావేశంలో అర్ అండ్ బి అధికారులతో రోడ్ల అంశాలపై పిఏసి చైర్మన్ ఎమ్మెల్యే అంజిబాబు చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లకే ప్రాధాన్యత ఇవ్వాలని, కాలువ ఉన్న చోట కల్వర్ట్ లు పోకుండా చేసుకోవాలని, రోడ్ల నిర్మాణంలో అశ్రద్ధ వహించవద్దని సూచించారు. బ్రిడ్జిల కింద చెత్త చెదరాలు వేయడంతో ఆ ప్రాంతమంతా నిండిపోతున్నాయని, రోడ్లపై కూడా చెత్త వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బి చీఫ్ సెక్రటరీ ఎండీ కృష్ణబాబు, చీఫ్ ఇంజనీర్లు శ్రీనివాస్ రెడ్డి, వివేకానంద, పిఏసి కమిటి సభ్యులు పాల్గొన్నారు.




## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు పంపిణీ

**ఎటపాక( మనసులో మాట) ఏప్రిల్ 16:** పోలవరం జిల్లా ఎటపాక మండలం గుండాల పంచాయతీ లోని గొల్లగట్ట గ్రామం లో బుద్ధుల సీతారాముడు, లక్ష్మి దంపతుల తాటాకు ఇల్లు ప్రమాదవశాత్తు కాలిపోయింది. సర్వం కూలిపోయిన ఆ కుటుంబానికి ఆసరాగా సీపీఎం పార్టీ నాయకుల అభ్యర్ధన మేరకు ఎటపాక మండల కేంద్ర లోని జటాయు లయన్స్ క్లబ్ వారు నిత్యావసర సరుకులు అందించారు. అలాగే అగ్ని ప్రమాదానికి పూర్తిగా ఇల్లు కాలిపోయి కట్టుబట్టలతో బయటపడ్డ సీతారాముడు కుటుంబానికి మరో స్వచ్ఛంద సంస్థ తెలంగాణ ప్రాంతానికి చెందిన భద్రాచలం లోని రెడ్ క్రాస్ సొసైటీ వారు వంట సామాగ్రి, బరకాలు, దుప్పట్లు బాధితు కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ తరుపున నక్క వెంకన్న, రాము, క్లబ్ సభ్యులు అలాగే సీపీఎం పార్టీ నాయకులు ఐ వి, బుద్దులు భద్రయ్య, ఆకిశెట్టి రాము, పెనుబల్లి భీష్మారావు, బుద్దులు ఏడుకొండలు, స్థానిక మాజీ సర్పంచ్ దంపతులు అలాగే భద్రాచలం సిపిఎం పార్టీ నాయకులు నర్సిరెడ్డి, గడ్డం స్వామి తదితరులు పాల్గున్నారు.

## ఇంటర్ ఫలితాల్లో వివేక జూనియర్ కాలేజ్ విద్యార్థుల ప్రభంజనం



**తుని (మనసులో మాట) ఏప్రియల్ 16.** ఇంటర్మీడియట్ ఫలితాల్లో తుని వివేక జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలలో తుని పట్టణంలో ప్రథమ స్థానంలో నిలిచామని కళాశాల యాజమాన్యం ప్రకటించింది. వరుసగా 5 సంవత్సరాల పాటు ప్రథమ స్థానంలో నిలవడం విశేషమని, విద్యా సంస్థలలో గర్వకారణమని విద్యా సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఎన్. సాయికృష్ణ 470 మార్కులకు గాను 465 మార్కులు, బైపీసీ విభాగంలో పి శివకృష్ణ 455 మార్కులకు గాను 448 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఎస్. హారిక 1000 మార్కులకు గాను 988 మార్కులు, బైపీసీ విభాగంలో పి స్వర్ణ 1000 మార్కులకు గాను 986 మార్కులు సాధించి పట్టణంలో అగ్రస్థానంలో నిలిచారని వివరించారు.

ఈ సందర్భంగా చైర్మన్ గరగా కృష్ణ, విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గరగా మధిలి మాట్లాడుతూ విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు పట్టుదలతో విజయాలు సాధిస్తున్నారని తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో అగ్రస్థానంలో నిలిచిన విద్యార్థులను విశేషంగా అభినందిస్తూ, భవిష్యత్తులో ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రిన్సిపాల్ పి సూరిబాబు, ఎన్.వి.ఎ. నాయుడు, గోవిందరాజులు, వరప్రసాద్, వీర భాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.

### కాకినాడ యాంకరేజ్ పోర్టులో రాష్ట్ర పౌర సరఫరా కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ ఆధ్వర్యంలో...

## పౌర సరఫరాల శాఖ, రెవిన్యూ అధికారుల సంయుక్తంగా తనిఖీలు...

- పిడిఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి - అక్రమంగా పోర్టు ద్వారా ఎగుమతి చేస్తున్నట్లు గుర్తించిన అధికారులు...
- 2.54 కోట్లు విలువచేసే 910 టన్నుల బాయిల్డ్ రైస్ సీజ్... - పది లారీలు కూడా (విలువ కోటి రూపాయలు) సీజ్...
- మొత్తం 3.54 కోట్ల విలువైనవి సేజ్ చేశామన్న జిల్లా పౌర సరఫరాల అధికారి రుద్రరాజు సత్యనారాయణరాజువెల్లడి...

**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 16..** రాష్ట్ర పౌర సరఫరా కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ ఆధ్వర్యంలో పౌర సరఫరా, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా కాకినాడ యాంకరేజ్ పోర్టులో తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా కాకినాడ యాంకరేజ్ పోర్టు దగ్గర భార్జీలలో, రైల్వే వ్యాగన్‌లలో ఉన్న బియ్యాన్ని పరిశీలించారు. తదుపరి చెక్‌పోస్టులోని రిజిస్టర్‌లను క్షుణ్ణంగా పరిశీలించి బాయిల్డ్ రైస్, రా రైస్, రా బ్రోకెన్స్ ఎగుమతి విధానాన్ని తెలుసుకున్నారు. టెక్నికల్ సిబ్బంది రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలను శ్రద్ధగా పరిశీలించి, వారికి సూచనలు ఇచ్చారు. తదుపరి మానస ఎంటర్‌ప్రైజెస్ గోదాన్‌లో స్టాకును పరిశీలించారు. ప్రాథమికంగా కొన్ని ఫోర్టిఫైడ్ కెర్నల్స్ ఉన్నట్లు గుర్తించారు. సత్య బాలాజీ, ఎస్ ఆర్ ట్రేడింగ్ వారు ఎగుమతి చేస్తున్నారని తేలింది. తదుపరి స్వార్టెక్స్ ప్లాంట్ ఎన్ డి ఆర్ గోదాన్, చిత్ర ఆగ్రో ఎగ్జిట్స్, కొవ్వూరి ఆనంద్ రెడ్డి గారి సార్టెక్స్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో 10 లారీలు బియ్యంతో కలిగి ఉన్నాయని గుర్తించారు. టెక్నికల్ అసిస్టెంట్ ద్వారా శాంపిల్స్ తీసుకుని కెమికల్ అనాలసిస్ చేయగా, సదరు బియ్యంలో బాయిల్డ్ రైస్‌లో ఫోర్టిఫైడ్ కెర్నల్స్ ఉన్నాయని తేలింది. వెంటనే మిల్ ఆవరణలో తనిఖీ చేశారు. షోర్ట్స్ మిల్‌లోని బాయిల్డ్ రైస్‌లో కూడా ఫోర్టిఫైడ్ కెర్నల్స్ ఉన్నాయని గుర్తించారు. ప్రొప్రైటర్ కొవ్వూరి ఆనంద్ రెడ్డి అతని మేనేజర్ శ్రీనివాసరావును విచారించగా, బాయిల్డ్ రైస్ బియ్యాన్ని ఒడిశా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ప్రజా పంపిణీకి సంబంధించిన ఫోర్టిఫైడ్ కెర్నల్స్ కలిగిన బాయిల్డ్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాల్లో తక్కువ ధరకు బల్క్‌లో కొని, అక్రమంగా ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారని తేలింది.

సీజ్ వివరాలు:.



ప్రాథమికంగా ఇతర రాష్ట్రాల్లో కార్డు దారులకు సరఫరా చేసే బాయిల్డ్ పిడిఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, అక్రమంగా పోర్టు ద్వారా ఎగుమతి చేస్తున్నారని గుర్తించారు. 10 లారీలలో 260 టన్నులు, ప్లాంట్‌లో 650 టన్నులు మొత్తం 910 టన్నుల బాయిల్డ్ బియ్యం విలువ రూ.2.54 కోట్లు, 10 లారీల విలువ సుమారు రూ.1 కోటి, మొత్తం రూ.3.54 కోట్లకు సీజ్ చేశారని జిల్లా పౌర సరఫరా అధికారి రుద్రరాజు సత్యనారాయణ రాజు తెలిపారు. అనాలసిస్ రిపోర్టుల కోసం జిల్లా మేనేజర్ వారికి శాంపిల్స్ పంపారు.

కార్డు దారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసే బియ్యంలో ఫోర్టిఫైడ్ కెర్నల్స్ ఉంటాయి. ఇవి బహిరంగ మార్కెట్‌లో ఉండవు. కేంద్ర ప్రభుత్వం కొన్ని రాష్ట్రాల్లో బాయిల్డ్ రైస్‌లో కూడా ఫోర్టిఫైడ్ కెర్నల్స్ జోడించి బలవర్ధకమైన ఆహారం ప్రజలకు సరఫరా చేస్తోంది. కొంతమంది తక్కువ ధరకు కొని ఇతర దేశాలకు ఎగుమతి చేయడం నేరమని తెలిపారు. సదరు వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరా అధికారి కాకినాడ తెలిపారు.

## 'నన్నయ'లో 20 వసంతాల వేడుకలు ప్రారంభించిన వీసీ ప్రసన్నశ్రీ

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 16:** ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం 20వ వార్షికోత్సవం (ఈ నెల 22న) సందర్భంగా 20 రకాల థీమ్స్ తో నిర్వహిస్తున్న కార్యక్రమాలను వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ ప్రారంభించారు. గురువారం యూనివర్సిటీ క్యాంపస్ లో గోదావరి కలశాలు సంప్రదాయ వరాలు, విభినం విలక్షణం వంటకం అనే రెండు కార్యక్రమాలను వీసీ ప్రారంభించారు. దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేస్తూ మన ప్రాంతానికి జీవనాధారంగా ఉండే గోదావరి నదిలో అరటి ఆకు కప్పులను, దీపాలతో పూజలు నిర్వహించి 20 విభాగాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు కలశాలుతో నీటిని తీసుకువచ్చి విశ్వ విద్యాలయ చెరువులలో వేశామన్నారు. అలాగే విభిన్నం విలక్షణం వంటకం అనే థీమ్ తో పొంగల్ వంటకాన్ని సామూహికంగా తయారు చేసి అందరూ కలసి తిన్నామన్నారు. ఇటువంటి కార్యక్రమాలు మన సంస్కృతి, సాంప్రదాయలు, సమిష్టికి ప్రతీకగా నిలుస్తాయని తెలియజేశారు. అలాగే మన వృక్షం మన భవిష్యత్తు, ఓ సంతకం ఓ గ్నాపకం, వికాసం వైపు, నన్నయ నుంచి నీ వరకు, నన్నయ పద్యం గోదావరి తరంగం, జ్ఞాపకం ఓ జ్ఞాపిక, విద్యా వృత్తి వ్యక్తిత్వం, గెలుపు గోదావరి గుర్తు, ఆదివారం – ఆది వారం, గంగ గోదావరి జ్ఞానం, చదువు చేదోడు దీవెన, నేను లేను నిన్న – చూస్తున్న ఈ రోజు నీ అందరికన్న, భిన్న మార్గాలు ఒకే గమ్యం, మనసు – మమత – మమకారం, భూమి బిడ్డ భవిష్యత్తు, కన్నీరు కన్నవారు కమనీయం, వెతుకు వెలుగు వేడుక, మట్టి మనిషి మహాత్యం అనే కార్యక్రమాలు జరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రోగ్రామ్ కన్వీనర్స్ డాక్టర్ పీ విజయనిర్మల, డాక్టర్ టీ హైమావతి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాల ద్వారానే రైతులకు మద్దతు ధర

### - నగరం ఏఎంసీ చైర్ పర్సన్ పెనుమాల లక్ష్మి

**పి గన్నవరం 16 మనసులో మాట** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారానే రైతులకు మద్దతు ధర లభిస్తుందనినగరం ఏఎంసీ చైర్ పర్సన్ పెనుమాల లక్ష్మి అన్నారు మామిడి కుదురు లోని నగరం సొసైటీలో చైర్మన్ ఈలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం చైర్ పర్సన్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎంతో కష్టపడి పండించిన పంటకు ప్రభుత్వగిట్టుబాటు ధర పొందాలన్నారు ఈ కార్యక్రమంలో ఏవో ఎన్ వివి సత్యనారాయణ సీఈవో అడబాల పెద్దిరాజు కమిటీ సభ్యులు కాకి శ్రీనివాస్ మట్టా సత్తిబాబు రైతులు పాల్గొన్నారు.






### తుని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

# ఇంటర్ ఫలితాలలో ప్రభంజనం

**తుని (మనసు లో మాట)ఏప్రిల్ 16..** ఇంటర్మీడియట్ ఫలితాల్లో తుని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు కళ్ళు చెదిరే విజయంతో రికార్డు సృష్టించారు. కాకినాడ జిల్లాలోనే ప్రభుత్వ విద్యా సంస్థల సత్తాను చాటుతూ, ఈ ఏడాది పరీక్షల్లో పతకాల పంట పండించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి మొత్తం 618 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 450 మంది అద్భుతమైన ఉత్తీర్ణత సాధించి కళాశాల కీర్తిని దశదిశలా వ్యాపింపజేశారు. కేవలం పాస్ అవ్వడమే కాకుండా, విద్యా నాణ్యతలోనూ రాజీ పడకుండా సుమారు 150 మందికి పైగా విద్యార్థినులు 90 నుండి 95 శాతం పైగా మార్కులను కైవసం చేసుకోవడం విశేషం.

ఈ అసాధారణ విజయ ప్రస్థానాన్ని చూసి కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ దంతులూరి బాబు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుకునే విద్యార్థినులకు సరైన ప్రోత్సాహం అందిస్తే వారు కార్పొరేట్ సంస్థలకు దీటుగా ఫలితాలు సాధించగలరని ఈ విజయం నిరూపించిందని ఆయన కొనియాడారు. విద్యార్థినుల కష్టానికి, అధ్యాపకుల అంకితభావానికి దక్కిన ఫలితం ఇదని పేర్కొంటూ, రేపటి తరం విజేతలుగా ఎదిగిన ఈ విద్యార్థులను ఆయన సాదరంగా అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి విద్యార్థినుల ప్రతిభను మెచ్చుకుంటూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ అద్భుత ఫలితాలతో తుని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల మరోసారి జిల్లాలోనే అత్యుత్తమ విద్యా కేంద్రంగా తన ప్రాధాన్యతను చాటుకుంది.

# ప్రయాణికుల భద్రతే లక్ష్యం కావాలి

### జిల్లా అగ్నిమాపక అధికారి - వి.సుబ్బారావు




**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 16..** ప్రజా రవాణా వ్యవస్థలో ప్రయాణికుల భద్రతే లక్ష్యం కావాలని జిల్లా అగ్నిమాపక అధికారి(అదనపు బాధ్యతలు)వి.సుబ్బారావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం కాకినాడ ఆర్టీసీ డిపోలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో వాహనాలు అగ్నిప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చోదకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్నినిరోధక పరికరాలు వినియోగం, అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రయాణానికి ముందే వాహన ఫిట్నెస్ సరిచూసుకోవాలని అన్నారు. ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. డిపిటివో శ్రీనివాసరావు మాట్లాడుతూ బస్సులలో ప్రేలుడు పదార్థాలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలెండర్లు రవాణాకు అనుమతించరాదని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎంయువి. మనోహర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ బాలకృష్ణ, పలువురు డిపో ఉద్యోగులు, డ్రైవర్లు పాల్గొనగా డిఎఫ్ఓ సుబ్బారావు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది ప్రత్యక్ష విధానంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.

### ప్రవేట్ కళాశాలలకు దీటు గా

# ప్రభుత్వ కళాశాలల ఇంటర్ విద్యార్థుల విజయకేతనం



**ఏలేశ్వరం (మనసులో మాట) ఏప్రిల్ 16..** ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల రెసిడెన్షియల్ కళాశాలల విద్యార్థులు ఇంటర్మీడియట్ లో ఘన విజయాలు సాధించడం గర్వం గా ఉందని ఆలమండ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అలమండ చలమయ్య అన్నారు. ఏలేశ్వరం లోని 2025- 26 విద్యా సంవత్సరానికి గాను కాకినాడ జిల్లా లో ప్రభుత్వ కళాశాలలలో విద్యాబ్యాసం చేసిన విద్యార్థులు నెంబర్ వన్ స్థానాన్ని సాధించడం గర్వంగా ఉందని అలమండ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అలమండ చలమయ్య గురువారం అన్నారు. ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఇంటర్ విద్యార్థులు 82 శాతం ఉత్తీర్ణత సాధిస్తే, ఏపీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల కళాశాలలోని విద్యాభ్యాసం చేస్తున్న ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసిన బాలికలు 98 శాతం ఉత్తీర్ణత సాధించడం ఏలేశ్వరం మండలానికి గర్వకారణమని అలమండ చలమయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కాలేజీలు మునుపెన్నడు లేనివిధంగా తీర్చిదిద్దిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి లోకేష్ లకు అభినందనలు తెలిపారు. ప్రైవేటు కళాశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు లక్షల పోసి చదివిస్తుంటే పేద ప్రజలకు అండగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్న కూటమి ప్రభుత్వం పిల్లలకు ఉచిత విద్యను అందించడంలో ముందంజలో ఉందన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ తన శక్తికి మించి ప్రత్తిపాడు నియోజకవర్గం లో ప్రభుత్వం నుంచి ప్రజలకందాల్సిన సంక్షేమ నిధులను దుర్వినియోగం కాకుండా ప్రజలకు అందించడంలో అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అలాగే ప్రజలు తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు, కాలేజీలకు పంపి తమ ధనాన్ని వృధా చేసే కన్నా ప్రభుత్వ స్కూళ్లలో కాలేజీల లో చేర్పించి ప్రభుత్వ పథకాలను పొందాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. ఎస్. ఎస్. రాజశేఖర్ ని , వైస్ ప్రిన్సిపాల్ కె. బాబ్జీ, అలాగే ఏపీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రెసిడెన్షియల్ గర్ల్స్ కాలేజ్ ప్రిన్సిపల్ కె.చంద్ర శారదలను ఘనంగా సన్మానించారు. అనంతరం ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ చంద్ర శారదా అలమండ ట్రస్ట్ చైర్మన్ చలమయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ రోజా రమణి, సిబ్బంది, జూనియర్ కాలేజీ సిబ్బంది అనిల్, శివాజీ, మాధవ, కనకరాజు, జ్యోతి, రాజేంద్రప్రసాద్, మోహన్, ఎస్తేరు, అలమండ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మాజీ కౌన్సిలర్లు బూరెల సత్తిబాబు, కడెంశెట్టి వాసు, తొండారపు రాంబాబు, బెల్లాన్ని శ్రీను, చిక్కాల సురేష్ పాల్గొన్నారు.

# చిన్నారుల సమగ్ర అభివృద్ధికి.. పోషణ పక్వాడ

### - కుటుంబ సభ్యులు సహకారం పై అవగాహన...



**ఏలేశ్వరం (మనసులో మాట) ఏప్రిల్ 16..** కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామంలో ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ సిడిపిఓ పద్మావతి ఆదేశాలతో 8వ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని: గురువారం నిర్వహించారు. ప్రత్తిపాడు ప్రాజెక్ట్ బద్రవరం సెక్టార్, సూపర్వైజర్ సూర్య కుమారి అద్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రనానికి ఏలేశ్వరం మండల పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి బుజ్జి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ పరిధి అంగన్వాడి కేంద్రాలలో 15 రోజులు పాటు ఈ పోషణ పక్వాడ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు.చిన్నారులకు రెండు సంవత్సరాలు వయస్సు వచ్చేసరికి మెదడు 80 శాతం అభివృద్ధి చెందుతుందని ఆమె తెలిపారు. నానమ్మ తాతయ్య అమ్మమ్మ తదితరులు పిల్లలకు మంచి మంచి కథలు చెప్పడం ద్వారా వారికి అభివృద్ధిపై ప్రేరణ కలుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చెడు వ్యసనాలైన ఐస్ క్రీమ్స్ చక్కెర వంటి పదార్థాలకుదూరం ఉంచాలన్నారు. స్క్రీన్ టీవీతో పాటు మొబైల్ ఫోన్ వంటి వాటికి చంటి బిడ్డలను దూరంగా ఉంచాలని కోరారు. తమ తమ పిల్లలకు ఇంటి లోపల మరియు బయట ప్రదేశాలలో ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె సూచించారు. దీని ద్వారా శారీరక నైపుణ్యాలు మెరుగుపడతాయని సామాజిక భావోద్వేగా వికాసం పెరుగు తుందన్నారు. మంచి పోషకాలు అందించాలని దీని ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని మెదడు అభివృద్ధికి సహాయపడుతుందని ఈ సందర్భంగాఏలేశ్వరం ఎం పి పి గొల్లపల్లి బుజ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ బాలింతలు ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లల తల్లులకు పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలింతలకు పోషక పదార్థాలను అందించారు. చిన్నారులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే ప్రక్రియ అంగన్వాడి కేంద్రాల ద్వారానే ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు జ్యోతుల పెద్దబాబు, లింగంపర్తి కోపరేటివ్ సొసైటీ చైర్మన్ పెంటకోట మోహన్, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి లక్ష్మణరావు, మండల తెలుగు యువత అద్యక్షులు పెంటకోట శ్రీదర్, ఎస్సీ సెల్ కన్వీనర్ నూకతాటి ఈశ్వరుడు, కూటమి నాయకులు, పెంటకోట కృష్ణ, ఏలేశ్వరం ఎంపీడీవో రామరాజు వర్మ, ఎర్రవరం సెక్టార్ ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్య కుమారి,గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఐసిడిఎస్ టీచర్ లు, హెల్పర్ లు, ఏ ఎన్ యం లు, వెలుగు వి ఓ ఏ,లు పలువురు గర్భిణీలు బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

# కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా నివాళులర్పించిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి



**అనపర్తి మనసులో మాట ఏప్రిల్ 16:** బాల్యవివాహాల నిర్మూలన, స్త్రీ విద్య కోసం ఉద్యమించిన సంఘ సంస్కర్త, విజ్ఞానంతో అంధకారాన్ని పారద్రోలిన వెలుగు వీరుడు కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా నివాళులర్పించిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి. అనపర్తి మండలం రామవరంలో బాల్యవివాహాల నిర్మూలన, స్త్రీ విద్య కోసం ఉద్యమించిన సంఘ సంస్కర్త, విజ్ఞానంతో అంధకారాన్ని పారద్రోలిన వెలుగు వీరుడు కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా ఆయన అందించిన సేవలను స్మరించుకుం టూ నివాళులర్పించిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గం కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్కరూ జనాభా నమోదులో భాగస్వాములు కావాలి

## - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 16:** జనాభా నమోదు ప్రక్రియలో భాగంగా రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) స్వయంగా తన వివరాలను నమోదు చేసుకున్నారు. తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో గురువారం ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొని వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్వహిస్తున్న జనాభా నమోదు కార్యక్రమం దేశ అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పనకు ఎంతో కీలకమన్నారు. ప్రతి పౌరుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తప్పని సరిగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. "తాను స్వయంగా నమోదు చేసుకున్నానని... ప్రజలందరూ బాధ్యతగా ముందుకు వచ్చి ఈ ప్రక్రియలో పాల్గొనాలి" అని ఎమ్మెల్యే తెలిపారు. జనాభా నమోదు ద్వారా ప్రభుత్వం ఖచ్చితమైన గణాంకాలను సేకరించి ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు వీలు కలుగుతుందని ఆయన వివరించారు. "డిజిటల్ యుగానికి అనుగుణంగా ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ స్వీయ జనాభా నమోదు విధానం ప్రజలకు ఎంతో సౌకర్యవంతమైనదన్నారు. ప్రతి కుటుంబం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఖచ్చితమైన జనాభా గణాంకాలు ప్రభుత్వానికి అందితే అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి దోహదపడతాయి" అన్నారు. ప్రజలు ప్రభుత్వం నిర్ణయించిన గడువు లోపు స్వీయ జనాభా నమోదు పూర్తి చేసి బాధ్యతాయుత పౌరులుగా తమ వంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# 23 వ రోజు కొనసాగిన జిజిహెచ్ ఆర్ఎంసి సెక్యూరిటీ గార్డ్స్ రిలే నిరాహారదీక్ష...

**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 16..** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, రంగరాయ వైద్య కళాశాలలో సెక్యూరిటీ సేవలందిస్తున్న కార్మికులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు పెంచాలని, క్యాజువల్ లీవులు అమలు చేయాలని, అక్రమంగా విధులకు దూరం చేసిన గార్డ్స్ ని డ్యూటీలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో జిజిహెచ్ సెక్యూరిటీ కార్యాలయం వద్ద మార్చి 25 న ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు 23వ రోజైన గురువారం కూడా నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు మట్టా హరనాథ్, పోర్ట్ యూనియన్ నాయకుడు ఆవుల కాశి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు లంకే ధర్మ మాట్లాడుతూ జిజిహెచ్ లో గత 20 సంవత్సరాలు గా సెక్యూరిటీ కాంట్రాక్ట్ పద్ధతిలో నడుస్తుందన్నారు. కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ వారు సిఐటియు అనుబంధ సభ్యులను 5 గురిని విధులకు దూరం చేసారన్నారు. 23 రోజులుగా రిలే నిరాహారదీక్ష చేస్తున్నామన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ యాజమాన్యం ఒక్కో సెక్యూరిటీ గార్డ్ నెల జీతం లో సుమారు 2300 రూపాయలు కాజేస్తున్నారని విమర్శించారు. గత చాలా కాలంగా అమలవుతున్న క్యాజువల్ లీవులు పూర్తిగా రద్దు చేసారన్నారు. దీనిపై విచారించి కార్మికులకు న్యాయం చేయాల్సిన జిజిహెచ్ అధికారులు పట్టించు కోకపోవడం శోచనీయమన్నారు. అదేవిధంగా సెక్యూరిటీ కాంట్రాక్ట్ యాజమాన్యం కూడా కార్మిక శాఖ ఆదేశాలు కూడా అమలు చేయడం లేదన్నారు. ఆర్ఎంసి సెక్యూరిటీ గార్డ్స్ కి నేటికీ ఫిబ్రవరి నెల జీతం జమ చేయలేదన్నారు. కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ ఎం.డి. రాజశేఖరరెడ్డి తో ఫోన్ లో సంప్రదించగా వచ్చే వారం కాకినాడ వస్తున్నట్లు తెలిపారన్నారు. 23 వ రోజు దీక్షల్లో సెక్యూరిటీ గార్డ్స్ లంకే ధర్మ, కె.భాగ్యలక్ష్మి, శేరు దుర్గ, పోతుల దేవి, ఎస్. శివగంగ లు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో, సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ లతో పాటు అప్పన్న, బాలరాజు, శ్రీనివాస్, సోమరాజు, ధర్మారావు వల్ల ఆదినారాయణ, సురేష్, సత్యవతి, కృష్ణవేణి, రమేష్, కెవై కుమారి, రోజా, దేవి తదితరులు పాల్గొన్నారు.



# గోవలంకలో అంతిమయాత్ర ఉచిత సేవలు ప్రారంభం

## - త్వరలో అందుబాటులోకి అంతిమయాత్ర ప్రత్యేక వాహనం

## - దాతలకు పలువురి అభినందనలు

**తాళ్లరేవు (మనసులో మాట) ఏప్రిల్ 16:** మండల పరిధిలోని సుంకరపాలెం గ్రామ పంచాయతీ చింతాకులవారి పేట గ్రామానికి చెందిన బొంతు సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతిమయాత్ర ఉచిత సేవలను గురువారం ప్రారంభించారు. వైఎస్సార్సీపీ రాష్ట్ర నాయకుడు చింతలపాటి శ్రీనివాసరాజు, బొంతు సత్యన్నారాయణ కుమారుడు వెంకన్న ఆర్థిక సహాయంతో అంతిమ సమయంలో మృతదేహాలను భద్రపరచేందుకు రెండు ఫ్రీజర్ బాక్సులను ఏర్పాటు చేసారు. మండల పరిధిలోని సుమారు 15 గ్రామ పంచాయతీల ప్రజలు అంతిమసమయంలో మృతదేహాలను భద్రపరచకునేందుకు వీటిని ప్రారంబించారు. వీటి కోసం గోవలంక స్మశాన వాటిక వద్ద ప్రత్యేకంగా గదిని నిర్మించి ప్రారంబించారు. అత్యవసర సమయాల్లో ఫ్రీజర్ బాక్సులు అవసరమైనవారు 9848493555 నంబరుకు ఫోన్ చేసి ఉచిత సేవలను పొందాలని బొంతు సత్యన్నారాయణ కోరారు. ఈ సందర్భంగా సత్యన్నారాయణ మాట్లాడుతూ అంతిమ సమయంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వీటిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా కడసారి అంతిమయాత్రకు వినియోగించే ప్రత్యేక వాహనాన్ని రూ. 5లక్షలతో కొనుగోలు చేసామని త్వరలోనే ఆ వాహనాన్ని కూడా అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. ప్రజాసేవే ధ్యేయంగా మానవత్వంతో ఫ్రీజర్ బాక్సులను ఏర్పాటు చేసిన దాతలు బొంతు సత్యన్నారాయణ, చింతలపాటి శ్రీనివాసరాజులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో చింతాకులవారిపేట గ్రామస్థులతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.





### బాటసారుల దాహార్తిని తీరుస్తున్న

# మజ్జిగ పంపిణీ

**పిఠాపురం, మనసులో మాట ఏప్రిల్ 16:** స్థానిక కోట గుమ్మం లో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద పిఠాపురం వాసవి క్లబ్ కపుల్స్, వాసవి క్లబ్ యువసేన ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. వేసవి తాపంతో ఇబ్బంది పడుతున్న బాటసారులకు ఉపశమనం కలిగించేందుకు గత ఆరు రోజులుగా ఈ సేవా కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ, సామాజిక బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, ప్రతిరోజూ వందలాది మందికి మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వేసవి తాపం ఉన్నంతకాలం మజ్జిగ పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కపుల్స్, యువసేన సభ్యులు పాల్గొన్నారు.

### వల్లూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో

# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**కపిలేశ్వరపురం (మనసులో మాట ) ఏప్రిల్ 16..** కపిలేశ్వరపురం మండలం వల్లూరుగ్రామ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. మండల విద్యాశాఖ అధికారులు కె. తాతారావు, విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అతిథులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతాయని అన్నారు. ప్రతి సంవత్సరం పాఠశాల ఇలా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సుబ్బరాజు, కామన్, తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిట్టూరి శ్రీధర్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



వెలగతోడు పాఠశాలలో ఘనంగా కందుకూరి

# జయంతి వేడుకలు

**మండపేట (మనసులో మాట ) ఏప్రిల్ 16..** నవయుగ వైతాళికుడు, సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకలు వెలగతోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు సొంటేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళా జనోద్ధరణకు నడుం కట్టి, మహిళా విద్యను ప్రోత్సహించిన మహనీయుడు కందుకూరి అని కొనియాడారు. ఉపాధ్యాయులు చల్లా సాయిబాబు, పల్లిభట్ల శ్రీహరి మాట్లాడుతూ బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ, వితంతు పునర్వివాహాలు జరిపిస్తూ మూఢాచారాలపై జీవితాంతం పోరాడిన సంఘసంస్కర్త కందుకూరి అని తెలిపారు. హితకారిణి సమాజం ద్వారా ప్రజలను చైతన్యవంతం చేశారని, వివేకవర్ధిని పత్రికను ప్రతిష్టాత్మకంగా నడిపారని ఉపాధ్యాయులు వీరభద్రరావు, వీర వెంకటరావు, యేసురాజు పేర్కొన్నారు. ఆయన చూపిన బాట అందరికీ ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యేసురాజు, వీర వెంకట్రావు, సాయిబాబు, శ్రీహరి, వీరభద్రరావు, ఆనంద్, వీర్రాజు, జనార్దన్ రావు, సహదేవుడు, కృపామణి, రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

# జల సంరక్షణ బాధ్యత నాది - నీది

- “జల్ పఖ్వాడా“ (జల సంరక్షణ)
- పులుగుర్త గ్రామ విద్యార్థులు భారీ ర్యాలీ



**అనపర్తి (మనసులో మాట) ఏప్రిల్ 16:** జల సంరక్షణ బాధ్యత నీది – నాది కార్యక్రమంలో భాగంగా ఆర్ఐవిఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పులుగుర్త విద్యార్థులు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె. సీతా మహాలక్ష్మి ఉపాధ్యాయులు, విద్యార్థులచే, జల ప్రతిజ్ఞ చేయించి, నీటి సంరక్షణ గురించి వివరించారు. అనంతరం గ్రీన్ కోర్ ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో, జలమే జీవం – జలమే సర్వం, ఇంకుడు గుంటలను తవ్వించండి – భూగర్భ జలాలను పెంచండి, జల సంరక్షణ బాధ్యత– నాది నీదే, చెరువులలో పూడికలు తీయించండి అంటూ నినాదాలు చేస్తూ, కరపత్రాలు పంచుతూ గ్రామంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ లో గ్రామ కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు జాస్తి రాంబాబు, గ్రామ పెద్దలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. రాంబాబు మాట్లాడుతూ పెద్ద చెరువు పూడిక తీయిస్తామన్నారు. ఈనెల 30వ తారీకు వరకు విద్యార్థులకు అనేక పోటీలు, నీటి సంరక్షణ పనులు నిర్వహింపబడతాయని సీనియర్ ఉపాధ్యాయుడు టి. సురేంద్ర అన్నారు. ఉపాధ్యాయులు డి.వెంకటేశ్వరరావు, కె.జయశ్రీ, ఎ.దుర్గాప్రసాద్, వరలక్ష్మి, సుధాకర్, లక్ష్మీ, రత్నకుమార్ పాల్గొన్నారు. ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ రచించిన “జలమే జీవం జలమే సర్వం“ అందరినీ ఆకట్టుకుంది.

# కాకినాడలో సెన్సస్ 2027 స్వీయ నమోదు ప్రారంభం

## - ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలి - ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 16..** భారతదేశ చరిత్రలో తొలిసారిగా సమగ్ర కుటుంబ సర్వేను ప్రజలే ఇంటి నుంచే ఆన్లైన్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునే విధానం అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కుటుంబ వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) పిలుపు నిచ్చారు. గురువారం సెన్సస్ 2027లో భాగంగా స్వీయ నమోదు ప్రక్రియను కాకినాడలో అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ యాప్ ద్వారా ఎమ్మెల్యే వనమాడి కొండబాబు చేత కుటుంబ వివరాలను నమోదు చేయించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు కలసి ఈ నెలాఖరి వరకు స్వీయ నమోదు అవకాశాన్ని కల్పించాయని తెలిపారు. ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వానికి ఖచ్చితమైన డేటా అందుబాటులోకి వచ్చి, భవిష్యత్తులో ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించడంలో ఇది ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. స్వీయ నమోదు ప్రక్రియ చాలా సులభమని, తక్కువ సమయంలోనే పూర్తి చేయవచ్చని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. ప్రజలు https://census.gov.in వెబ్సైట్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఈ సర్వేలో సరైన సమాచారం ఇవ్వడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి సమర్థవంతంగా అందించడంలో ఇది ఒక కీలక ముందడుగుగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాస్, డీసీపీ కె.వి. కృష్ణరావు, హెల్త్ ఆఫీసర్ డా. పృథ్వీచరణ్, టిపిఆర్వో శైలజ, టిడిపి నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభ లను జయప్రదం చేయండి

## కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికుల ఉద్యోగ భద్రత కై 26 వ తేది న చలో తిరుపతి...



**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 16..** ఆల్ఇండియాట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏఐటియుసి ఏప్రిల్ 26 నుండి 28 వరకు తిరుపతిలో జరిగే 18వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని గురువారం ఉదయం కాకినాడలో స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయం ఎదురుగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కాకినాడ కమిటీ అధ్యక్షులు బొబ్బిలి శ్రీనివాసరావు అధ్యక్షతన వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేయడం. దీనికి ముఖ్య అతిథిగా ఏఐటియుసి కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఐటియుసి అనుబంధ ప్రజా సంఘాల మున్సిపల్, మెడికల్, భవన నిర్మాణ, జట్లు, సివిల్ సప్లై హమాలి ఎలక్ట్రిసిటీ, ఆర్టీసీ, హమాలి, ఆటో, వీధి విక్రయ, ఆశ, అంగన్వాడి, మధ్యాహ్నం భోజన పథకం, స్కూల్స్ స్వీపర్స్, పంచాయతీ వర్కర్లు, గ్రామీణ ఉపాధి హామీ కూలీలు, పోస్టల్, బిఎస్ఎన్ఎల్ తదితర రంగాల అనుబంధ సంఘమైన ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు ఏప్రిల్ 26 తేదీ నుండి 28 వరకు అంగరంగ వైభవంగా తిరుపతి పుణ్యక్షేత్రంలో జరగనున్నాయని, 26వ తేదీ ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గల చింతల చేను మార్గం నుండి ప్రదర్శన ప్రారంభమవుతుందని, సాయంత్రం నాలుగు గంటలకు ఇందిరా మైదానంలో బహిరంగ సభ జరుగుతుందని ఆయన అన్నారు. ఈ బహిరంగ సభలో సభాధ్యక్షులుగా రావులపల్లి రవీంద్రనాథ్ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు, ముఖ్య అతిథిగా కామ్రేడ్ అమర్ జీత్ కౌర్ ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, వక్తులుగా కామ్రేడ్ గుజ్జల ఈశ్వరయ్య సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కామ్రేడ్ వెంకటసుబ్బయ్య ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కామ్రేడ్ హరినాథ్ రెడ్డి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హాజరవుతారని ఆయన అన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు, సమాన పనికి సమాన వేతనం భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణకై ఈ తిరుపతి మహాసభలు వేదిక కానున్నాయని ఏఐటీయూసీ అనుబంధ ప్రజా సంఘాలు ఏప్రిల్ 26న తిరుపతి తరలిరావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో తుపాకుల లక్ష్మీనారాయణ, బంగారు రాజేష్, కుమార్, శ్రావణి, సంతోషి, జె హర్షవర్ధన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ జనాభా నమోదులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు...

## – ఎమ్మెల్సీ పేరాబత్తుల



**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 16..** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 16వ జనాభా గణన ప్రక్రియలో భాగంగా, ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం గురువారం తమ వివరాలను ఆన్లైన్లో స్వయంగా నమోదు చేసుకున్నారు. విజయవంతంగా స్వీయ-గణన పూర్తి చేసి, జనరేట్ అయిన ఎస్ ఈ ఐడి ని ఆయన మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ భవిష్యత్తు ప్రణాళికలు, సంక్షేమ పథకాల అమలు, నిధుల కేటాయింపులకు కచ్చితమైన జనాభా లెక్కలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. దేశ చరిత్రలో తొలిసారిగా పూర్తి డిజిటల్ విధానంలో జరుగుతున్న ఈ జనాభా గణనలో ప్రజలంతా చురుకుగా భాగస్వాములు కావాలని కోరారు. ఏప్రిల్ 16 నుండి 30వ తేదీ వరకు అందుబాటులో ఉండే https://se.census.gov.in వెబ్ పోర్టల్ ద్వారా ప్రతి పౌరుడూ తమ మొబైల్ లేదా కంప్యూటర్ నుండి సులభంగా కుటుంబ వివరాలు నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఆన్లైన్ నమోదు పూర్తయిన తర్వాత వచ్చే రిఫరెన్స్ ఐడీ (ఎస్ ఈ ఐడి ) ని భద్రపరుచుకుని, మే నెలలో ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు (గణాంక సిబ్బందికి) చూపించడం ద్వారా సమయం ఆదా అవుతుందని వివరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి (కాకినాడ, తూర్పు గోదావరి, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ) జిల్లాలలోని యువత, విద్యావంతులు, పట్టభద్రులు ఈ నూతన డిజిటల్ విధానం పట్ల సామాన్య ప్రజలకు అవగాహన కల్పించాలని సాంకేతికత ను సద్వినియోగం చేసుకుని అందరూ తమ వివరాలను సొంతంగా నమోదు చేసుకునేలా బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం పిలుపు నిచ్చారు.



## మర్యాదపూర్వకంగా

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి గంధం సునీత ని మర్యాద పూర్వకంగా కలిసిన కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం. ఎన్ . హరేంధిర ప్రసాద్**

కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 16.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కోర్ట్ రాజమండ్రి లో ప్రిన్సిపల్, సెషన్స్ జడ్జి గంధం సునీత ని జిల్లా జడ్జి కోర్టు ఛాంబర్ లో కాకినాడ జిల్లా నూతన కలెక్టర్ ఎం. ఎన్ హరేంధిర ప్రసాద్ గురువారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపి, జిల్లా న్యాయ సేవల అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా, ఇటీవల కాకినాడ జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టి, తొలిసారి తనను మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ ఎం. ఎన్ . హరేంధిర ప్రసాద్ ని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కోర్ట్ (రాజమండ్రి)ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి సునీత గంధం అభినందనలను తెలిపి అల్ ది బెస్ట్ చెప్పారు.

## తూర్పు గోదావరి జిల్లా టీం పసి ప్రాణానికి 'చేయూత'..



రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 16: రాజమహేంద్రవరం సిద్ధార్థ చిల్డ్రన్ హాస్పిటల్ లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న పసి పాపకి 'చేయూత' ఫౌండర్ రవి ఆదేశాలతో తూర్పు గోదావరి జిల్లా 'చేయూత' టీం తక్షణ ఆర్థిక సాయంగా పదివేల రూపాయలు పాప తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చేయూత గౌరవ అధ్యక్షుడు నాగేశ్వరరావు, అధ్యక్షుడు సాక అనిత, సెక్రటరీ గౌరీనాథ్, జాయింట్ సెక్రటరీ సభ్యులు, సహా అధ్యక్షుడు బంగార్రాజు, అక్రమ్, కరీం, వెంకటేష్ పాల్గొన్నారు.

## స్వీయ గణనలో అందరూ భాగస్వాములు కావాలి

**- కాకినాడ ఆర్ డి ఓ ఎస్. మల్లిబాబు**



కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 16.. స్వీయ గణనలలో భాగంగా కాకినాడ ఆర్డిఓ మల్లి బాబు ఆన్లైన్లో హౌస్ హోల్డ్ స్వీయ గణనలో గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీయ గణన 2027 ప్రకారం ఈనెల 16 నుండి 30వ తారీఖు వరకు హౌస్ హోల్డ్ స్వీయ గణనలో పాల్గొనాలని తదుపరి మే ఒకటి నుండి 30వ తేదీ వరకు జన గణనలో అందరూ భాగస్వాములు కావాలని ఆర్ డి ఓ మల్లిబాబు పిలుపునిచ్చారు.

# కాలువల విస్తరణ పనుల కోసం 74.2 కోట్లు నిధులు కేటాయింపు - కలెక్టర్





అమలాపురం( మనసులోమాట) ఏప్రిల్ 16: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్లలాకులు కాలువలు మూసివేత క్లోజర్ సమయంలో మరమ్మతు ఆధునీకరణ, రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ. 74.2 కోట్లు కేటాయించిందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. గురువారం ఈ మేరకు రెవెన్యూ రవాణా జలవనురుల శాఖలతో స్థానిక కలెక్టరేట్లో సమావేశం నిర్వహించి లొల్లలాకులు బొబ్బర్లంక -రావులపాలెం 12.5 మీటర్ల వెడల్పుతో రాష్ట్ర రహదారి విస్తరణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అదే విధంగా షట్టర్లు లాకులు వద్ద మరమ్మత్తు ఆధునీకరణ పనుల ప్రతి పాదనలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈనెల 2వ తేదీన ఈ యొక్క పనులకు గాను పరిపాలన అనుమతి లభించిందన్నారు. లాకులు డిజైను డ్రాయింగు పనులకు సంబంధించి ప్రతిపాద నలు చీఫ్ ఇంజనీర్ ఆధ్వర్యంలోని సెంట్రల్ డిజైనర్గనేషన్స్ కు సమర్పిం చడం జరిగిందన్నారు. రోజురోజుకు వాడపల్లి శ్రీ వెంకటే శ్వర దేవస్థానం భక్తుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర రహదారిగా రావులపాలెం- బొబ్బర్లంక రహ దారిని తీర్చిదిద్దడం జరుగుతుందని అదేవి ధంగా ఎక్కువగా ఇసుక రీచులు ఈ రహదారి వెంబడి ఉన్న నేపథ్యంలో సుమారు 32 టన్నుల బరువు గల ఇసుక తరలింపు వాహనాలు సంచ రించే విధంగా డిజైన్ రూపొం దిస్తున్నట్లు ఆయన తెలిపారు. 12.5 మీటర్ల వెడల్పుతో రోడ్డు విస్తరణకు ప్రతిపాదించామన్నా రు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ యొక్క రహదారికి మరింత పటిష్టత చేకూరే విధంగా సన్నాహాలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ముందుగా జల వనరుల శాఖ ఇంజనీర్లు రూపొం దించిన డిజైన్లను ఆయన నిశితంగా పరిశీలించి పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. డిజైన్ అనుమతులు వచ్చిన పిదప మరోసారి చర్చించి పనులకు టెండర్లను పిలవడం జరుగుతుందన్నా రు. రాష్ట్ర రహదారిగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈ రోడ్డు నిర్మాణం మరింత నాణ్యత ప్రమాణాలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జల వనరుల శాఖ ఈఈ కే వెంకటేశ్వరరావు, జేఈ ప్రసన్న మాధవ్, డి టి వో డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోండి



ముమ్మిడివరం(మనసులో మాట ) ఏప్రిల్ 16.. పెరుగుతున్న విద్యుత్ అవసరాలు దృష్టిలో పెట్టుకొని వినియోగదారుల ఇబ్బందులను తొలగించేందుకు.. మళ్ళీ తిరిగి వారు ఆదాయాన్ని పొందేలా రూపకల్పన చేసిన ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని వినియోగించు కోవాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెం లో దేవరపల్లి వెంకటేశ్వరరావు పీఎం సూర్యఘర్ యోజన పథకం లో పూర్తి సబ్సిడీపై ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్ ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్య ఘర్ యువజన ద్వారా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు పూర్తిగా విద్యుత్ భారం తగ్గించి వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు.సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణ తోడ్పడటంతో పాటు గ్రామీణ ప్రాంతంలో స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని ఆయన సూచించారు.ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి వారు వినియోగించుకునేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు.డి. ఈ.ఈ డి. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో ముమ్మిడివరం,ఐ. పోలవరం,కాట్రేనికోన మండలంలో 18, 000 ఎస్సీ ఎస్టీ విద్యుత్ వినియోగదారులు ఉండగా, వారిలో 200 లోపు యూనిట్లు వినియోగించు కుంటున్న వారిని 8 వేలు సర్వీసులు ఉండగా వారిలో 4 వేల విద్యుత్ సర్వీసులు ఈ పథకానికి అర్హులుగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెల్లి అశోక్, తాడి నరసింహారావు, గొలకోటి దొరబాబు, కట్టా సత్తిబాబు, ములపర్తి బాలకృష్ణ, వి క్ల వీరాస్వామి నాయుడు,దాట్ల బాబు, బొక్కా రుక్మిణి, ఎం. కమల, కాశి రామచంద్రరావు,ర్యాలి ప్రసాద్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో అనపర్తి జిబిఆర్ రికార్డు విజయాలు



అనపర్తి ( మనసులో మాట) ఏప్రిల్ 16: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డ్ నిర్వహించిన పరీక్షల ఫలితాలను మంత్రి నారా లోకేష్ బుధవారం విడుదల చేయడం జరిగింది. ఈ ఫలితాల్లో అనపర్తి జిబిఆర్ విద్యాసంస్థల విద్యార్థులు రికార్డు స్థాయి విజయాలు నమోదు చేసినట్లు జిబిఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పిఆర్ఎల్ స్వామి తెలియజేశారు. ద్వితీయ సంవత్సరంలో డిఎస్ వీర పూజిత ఎంపిసి విభాగంలో 992 మార్కులు సాధించి నియోజకవర్గ మొదటి స్థానాన్ని దక్కించుకుంది. దుప్పలపూడి రమ్య, కె ఎస్ సాయి తులసిరెడ్డి లు 986 మార్కులు, మేడపాటి బాలశ్రీ, కొవ్వూరి లక్ష్మీ సత్యశ్రీ లు 983 మార్కులు, బైపిసి విభాగంలో మురమళ్ళ మానస 985 నియోజకవర్గ మొదటి స్థానాన్ని దక్కించుకోగా, మురిపాక అఖిల 974, ప్రియదర్శిని 971 మార్కులు, సిఈసి విభాగంలో ఎం ప్రజ్ఞ శారిన్ 953 మార్కులతో మొదటి స్థానం దక్కించుకోగా... మల్లిడి చందన విహారిక 932 మార్కులు, సీనియర్ హెచ్ఈసి విభాగంలో బల్లా సిరి 919 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ స్వామి తెలియజేశారు. మొదటి సంవత్సరంలో ఎంపిసి విభాగానికి సంబంధించి ఏ.సౌమ్యశ్రీ 467 మార్కులతో నియోజకవర్గ మొదటిస్థానాన్ని దక్కించుకోగా కొత్తపల్లి శారద సమన్విత, ఎమ్. శర్వాణి, సత్తి శంకర మణికంఠ రెడ్డి 465 మార్కులు, కర్రి సంజీవరెడ్డి, సత్తి సూర్య నాగ వర్షిని 464 మార్కులు, బైపిసి విభాగంలో జి భాగ్యశ్రీ 450, మొదటి స్థానాన్ని దక్కించుకోగా జి. నవ్య, ద్వారంపూడి పూజ వైష్ణవిలు 446,బి. హర్షిని వీర వేణి 445 మార్కులు, సీఈసీ విభాగంలో ఈపిఎస్ ప్రసన్న వైష్ణవి 486, నియోజకవర్గ మొదటి స్థానాన్ని దక్కించుకోగా జి. అజయ్ సూర్య 469, కొప్పిశెట్టి వంశీకృష్ణ 438, హెచ్ఈసి విభాగంలో విడిఎస్ వర్ధిని 460 మార్కులు, ఎం. బైపిసి విభాగంలో పందిరి సాత్విక్ 530 మార్కులు నియోజకవర్గ మొదటి స్థానాన్ని దక్కించుకోగా, కె ఆర్ వి కృపాకాంత్ 500 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ స్వామి వెల్లడించారు. గ్రామీణ ప్రాంతంలో ఉత్తమ ఫలితాలు సాధించడంలో జిబిఆర్ విద్యాసంస్థలు ఎప్పుడు రికార్డ్ లు దక్కించుకోవడం జరుగుతుందని. ఈ విజయ యాత్రను కొనసాగింపుగా ఈ విద్యా సంవత్సరంలో కూడా ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు విద్యాసంస్థల నిర్వాహకులను అధ్యాపక బృందాన్ని అభినందించడం విశేషం.



# బీసీ సంఘం నూతన నాయకులకు సత్కారం


**మండపేట (మనసులో మాట ) ఏప్రిల్ 16..** జాతీయ బిసి సంఘం మండపేట నియోజకవర్గ అధ్యక్షులుగా నూతనం గా నియమితులైన ఏడిద కొత్తూరుకి చెందిన వాశంశెట్టి వెంకటరమణను, రాష్ట్ర యువజన కార్యదర్శిగా నియమితులైన ఏడిద గ్రామానికి చెందిన ఉడతా రమేష్‌ను గురువారం గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. ఇరువురిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిద గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పర్వతిన వీర్రాజు, గ్రామ సొసైటీ చైర్మన్ గొడవర్తి సత్యనారాయణ, ఏడిద గ్రామ జనసేన అధ్యక్షులు రామిశెట్టి రాజా, ఏడిద సావరం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కోటబాబు, గ్రామ మాజీ అధ్యక్షులు మేకా జేజిబాబు, జనసేన పార్టీ నాయకులు తుంపాల ఆదినారాయణతో పాటు చిట్టూరి ప్రసాద్, చిపూరి శ్రీను, పదం ఆనంద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కోకనాడ ఎక్స్‌ప్రెస్ కు సామర్లకోటలో హాల్ట్ సౌకర్యం

- కోకనాడ ట్రైన్ ను రోజువారి నడిపేందుకు గ్రీన్ సిగ్నల్
- ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడి



**కాకినాడ (మనసులో మాట) ఏప్రియల్ 16..** కాకినాడ మధ్య లింగంపల్లి మధ్య నడుస్తున్న కోకనాడ ఎక్స్ ప్రెస్ ట్రైన్ కు సామర్లకోట జంక్షన్ లో హాల్ట్ సౌకర్యం కల్పించడంతో పాటు రోజువారీ సర్వీస్ నడిపేందుకు రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కాకినాడ– లింగంపల్లి మధ్య ప్రస్తుతం రోజూ నడుస్తున్న గౌతమి ట్రైన్ కు ప్రయాణికుల రద్దీ పెరగడంతో, వారానికి మూడు రోజులు నడుస్తున్న 'కోకనాడ' ట్రైన్ ను రోజువారీ నడిపి, అదనంగా సామర్లకోటలో హాల్ట్ సౌకర్యం కల్పించాలని గత ఏడాది డిసెంబర్ లో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు లేఖ రాయడంతో పాటు పలుమార్లు వ్యక్తిగతంగా కలిసి విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు, దీనిపై సానుకూలంగా స్పందించిన రైల్వే శాఖ ఈనెల 21 నుండి కోకనాడ ట్రైన్ ను రోజువారి నడపడంతో పాటు, సామర్లకోట స్టేషన్ లో హాల్ట్ సౌకర్యం కల్పిస్తూ గురువారం ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. దీనిపై తూర్పుగోదావరి జిల్లా మరియు కోకనాడ రైల్వే ప్రయాణికుల సంఘం అధ్యక్షులు వై డి రామారావు హర్షం వ్యక్తం చేస్తూ ఎన్నో ఏళ్ల కల అయిన సామర్లకోట హాల్ట్ ను సహకారం చేసిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు.




# పుట్ట గొడుగుల్లా కిందర్ గార్డెన్ స్కూల్స్

## - విద్యా సంవత్సరం ముగియకుండానే అడ్మిషన్స్ ప్రారంభం

## - తనిఖీలు మరచిన విద్యాశాఖ అధికారులు

**ముమ్మిడివరం(మనసులో మాట ) ఏప్రిల్ 16..** జిల్లా కేంద్రం అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట, రాజోలు, రామచంద్రపురం లలో దాదాపుగా అన్ని మండల కేంద్రాలు, పెద్ద పంచాయతీల్లో ప్రైవేటు స్కూళ్లలో అడ్మిషన్ల దందా మొదలైంది.డా. బి. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 472 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. దీనిలో 1 వ తరగతి నుండి 5 వ తరగతి వరకూ 125 పాఠశాలలు, 1వ తరగతి నుండి 7 వ తరగతి వరకూ 167 పాఠశాలలు మరియు 6 వ తరగతి నుండి 10 వ తరగతి వరకూ 180 పాఠశాలలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల స్థాయిలోనే ఐఐటీ, నీట్ ఫౌండేషన్ ప్రోగ్రామ్‌ల పేరుతో విద్యార్థులపై మితిమీరిన ఒత్తిడి పెంచుతున్నారు. తల్లిదండ్రులపై అదనపు ఫీజుల భారం మోపుతున్నారు. కార్పొరేట్ స్థాయి వసతులు, అంతర్జాతీయ ప్రమాణాలు అంటూ రంగురంగుల బ్రోచర్లు చూపిస్తూ సామాన్య తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి యాజమాన్యాలు. తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు తమ కళ్ల ముందే నిబంధనలు ఉల్లంఘన జరుగుతున్నా మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**కార్పొరేట్‌కు సలామ్:**

కార్పొరేట్ శక్తులు విద్యను వ్యాపారంగా మార్చేశాయి. జిల్లాలో కార్పొరేట్, కొన్ని బడా ప్రైవేటు యాజమాన్యాలు అనుమతుల్లేకపోయినా ధనదాహంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నిర్వహిస్తున్నా అటువైపు అధికారులు కన్నెత్తయినా చూడడానికి సాహసించడం లేదు. నిబంధనల ప్రకారం ఎల్‌కేజీ, కేజీ, యూకేజీ తరగతుల నిర్వహణకు అనుమతులు ఇవ్వరు. కానీ ప్రైవేటు పాఠశాలల్లో ఈ తరగతుల నిర్వహణ నిరాటంకంగా కొనసాగిపోతోంది. విద్యాశాఖ అధికారుల తీరుతో యాజమాన్యాలు ఆడిందే ఆట..పాడిందే పాట అన్న చందంగా వాటి నిర్వహణ సాగుతోంది.

**సమాచారం నిల్:**

జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కిందర్ గార్డెన్ స్కూళ్ల వివరాలు నమోదైన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. కార్యాలయ అధికారులు తమకు తగిన సమాచారం లేదంటున్నారు. మరోవైపు కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో నిబంధనలు బేఖాతరు చేస్తూ అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తున్నా నేటికీ ఒక్క స్కూల్‌పై కూడా చర్యలు చేపట్టలేదంటేనే కార్పొరేట్ యాజమాన్యాలతో వారికి ఉన్న బంధం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో అనుమతులు లేకుండానే ప్రైమరీ, ఉన్నత పాఠశాలలను నిర్వహిస్తున్నారు.

# దుప్పులపాలెం ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ

## సెన్సెస్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ రాజ్

**రంపచోడవరం, మనసులో మాట ఏప్రిల్ 16 :** కేంద్ర ప్రభుత్వం డిజిటల్ విధానంలో జనగణన సెన్సెస్ 2026 -27 స్వీయ గణన కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతం గా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. ఈ సెన్సస్ కార్యక్రమం పోలవరం జిల్లా కలెక్టర్ కే దినేష్ కుమార్ వారి ఆధ్వర్యంలో గురువారం అడ్డతీగల జిల్లా పరిషత్ పాఠశాలలో 2026-27 సెన్సెస్ శిక్షణ కార్యక్రమాన్ని పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈనెల 16వ తారీకు నుండి ఈనెల 30వ తారీఖు వరకు పోలవరం జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో గ్రామాలలో డిజిటల్ జనగణన-స్వీయ గణన లో భాగంగా కుటుంబంలోని సభ్యుల వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకుని విధంగా పంచాయితీ కార్యాలయాలకు సంబంధించిన సిబ్బంది మీ మీ పరిధిలో గల గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని సచివాలయాలకు సంబంధించిన సిబ్బందిని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. డిజిటల్ పద్ధతిని పారదర్శకంగా అదేవిధంగా వేగంగా నమోదు చేసుకునే విధంగా జిల్లాలోని ప్రజలు మీమీ మొబైల్ లో గాని, కంప్యూటర్ల ద్వారా గాని అదేవిధంగా ప్రభుత్వ పోర్టర్ లో లాగిన్ అయి మీ మీ వివరాలను స్వయంగా పొందుపరచుకోవాలని ఆయన ప్రజలను కోరారు. అనంతరం మీ భూమి మీ హక్కు రీ సర్వే దుప్పుల పాలెం గ్రామంలో ఏ విధంగా చేయుచున్నది ఆయన పరిశీలించారు. ఈ సర్వేలో భూమి హద్దులకు సంబంధించిన ఇరువురి రైతులను దగ్గర ఉంచి హద్దులు వేసుకునే విధంగా ఎటువంటి భూ తగాదాలకు తావు లేకుండా రీ సర్వే పక్కాగా చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. సర్వే చేయు గ్రామాలలో ముందుగా ఆయా గ్రామాలలో ప్రజలకు తెలియజేయాలని ఆయన అన్నారు. అనంతరం దుప్పుల పాలెం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ముందుగా ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంతమంది వైద్యులు ఉన్నది ఎంతమంది సిబ్బంది ఉన్నది, ప్రతిరోజు ఎంతమంది పేషెంట్లు వచ్చుచున్నది, ఏ ఏ మందులు అందుబాటులో ఉన్నది ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ఆస్పత్రులకు వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని ఆయన అన్నారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎంతమంది గర్భిణీ స్త్రీలు ఉన్నది, ఎంతమంది బాలింతలు ఉన్నది ఆయన ఆరా తీశారు. వివిధ వ్యాధులకు సంబంధించిన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో పెట్టాలని ఆయన అన్నారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. అదేవిధంగా రక్త పరీక్షలు ఏ విధంగా చేయుచున్నది ఆయన ఆరా తీశారు. అదేవిధంగా ఈ ప్రాంత ప్రజలకు జీసీసీ ద్వారా గ్యాస్ ఏవిధంగా సరఫరా చేయుచున్నది ఆయన పరిశీలించారు జాయింట్ కలెక్టర్ వారి వెంట తాసిల్దార్ దొరకయ్య, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ మిరియాల లక్ష్మణ్, సర్వేర్లు, వీఆర్వోలు, వైద్యాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

**ముమ్మిడివరం(మనసులో మాట ) ఏప్రిల్ 16..** ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఆశ వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సి.ఐ.టి.యు జిల్లా అధ్యక్షుడు జి దుర్గాప్రసాద్,ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.ఎస్తేరు రాణి కార్యదర్శి సుభాషణలు డిమాండ్ చేశారు. కళాశాలలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో డి. ఎం. హె చ్.ఓ దుర్గారావు దొర ను కలిసి ఆశా వర్కర్ల సమస్యల పై చర్చించారు. సర్వర్ సమస్యతో 13 మంది ఆశా వర్కర్లకు నిలిచిపోయిన వేతన బకాయిలు విడుదల చేయాలని, ఆశ వర్కర్లతో సంబంధం లేని పనులు చేయిస్తున్నారని, 9 ఏళ్ల క్రితం ఇచ్చిన ఫోన్లు సరిగా పనిచేయట్లేదు అని కొత్త ఫోన్లు ఇవ్వాలని, అనారోగ్యంతో మృతి చెందిన జి.వీరమణి కుటుంబానికి ఇన్సూరెన్స్ క్లెయిమ్ త్వరగా అందించి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని,ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని తదితర సమస్యలపై చర్చించారు. ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి. హెచ్. సి నాయకులు జి శాంతి, వి లక్ష్మి,ఉమామహేశ్వరి, దుర్గాదేవి,ఆదిలక్ష్మి,పుష్ప కుమారి, శ్యామల కుమారి తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని బాధిత కుటుంబానికి టీడీపీ మండల కమిటీ చేయూత



**ఎటపాక ( మనసులో మాట) ఏప్రిల్ 16:** పోలవరం జిల్లా ఎటపాక మండలం గుండాల గ్రామ పంచాయతీ పరిధిలో గల గొల్లగట్ట గ్రామంలో బుద్ధుల సీతారాములు తండ్రి జోగయ్య ఇల్లు బుధవారం అగ్ని ప్రమాదానికి గురై పూరీళ్ళు పూర్తిగా దగ్నం అయ్యింది.ఆ అగ్ని ప్రమాదం లో సుమారు 5 లక్షల రూపాయలు ఆస్తి నష్టం జరిగింది.దాంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. అట్టి విషయాన్ని తెలుసుకున్న టీడీపీ మండల కమిటీ ఆ కుటుంబానికి చేయూత ఇచ్చింది.ఆ కుటుంబానికి టీడీపీ మండల అధ్యక్షులు బొల్లా పుల్లయ్య 3000 ఆర్థిక సహాయం అందించగా, మాజీ వైస్ యం పి పి రావి మాధవరావు నిత్యావసర వస్తువులు, స్టీల్ సామాగ్రి అందిచడం జరిగింది.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అగ్ని బాధిత కుటుంబానికి టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది అని, వారికీ ప్రభుత్వం నుంచి వచ్చే సహాయాన్ని త్వరగా వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇవ్వడం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గుండాల కమిటీ అధ్యక్షులు పెరలా వెంకటేశ్వర్లు,బీసీ సెల్ అధ్యక్షులు ముత్యం సురేష్ గౌడ్,మండల మహిళా అధ్యక్షురాలు టేకుమల్ల రూప లక్ష్మి,గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి సాయలి బాబు, సోసైటీ డైరెక్టర్ రాసాల నరసింహ రావు,ముత్యం నరేష్ గౌడ్, టీడీపీ నాయకులు ముక్క కిరణ్, గుండాల గ్రామ ఉపాధ్యక్షులు నడిపింటి వెంకన్న, టీడీపీ నాయకులు దానె రాజు,మడివి రామారావు,తదితరులు పాల్గొన్నారు.

### కాకినాడలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు కార్యాలయం వద్ద...

# టీడీపీ శ్రేణులు సంబరాలు



**కాకినాడ (మనసులో మాట), ఏప్రిల్ 16:** టీడీపీలో తాజా కీలక నియామకాలు కాకినాడ జిల్లాలోని ఆ పార్టీ శ్రేణులలో నూతనోత్సాహాన్ని తీసుకొచ్చాయి. టీడీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ నిర్ణయాలతో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. యువ నాయకుడు నారా లోకేష్‌ను పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించగా, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబును జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించారు. అలాగే కాకినాడ జిల్లాకు చెందిన పలువురు నాయకులకు పొలిట్ బ్యూరోలో స్థానం కల్పించటం, రాష్ట్ర కమిటీలోనూ జిల్లాకు ప్రాధాన్యత ఇవ్వటం స్థానిక నాయకుల్లో ఆనందాన్ని రెట్టింపు చేసింది. ఈ నియామకాలను పురస్కరించుకుని గురువారం ఉదయం కాకినాడలోని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకుని ఘనంగా సంబరాలు నిర్వహించారు. తీన్మార్ డప్పులతో కార్యాలయ పరిసరాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. జై తెలుగుదేశం.. జై చంద్రబాబు.. జై లోకేష్.. జై సానా అంటూ నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది.

కార్యకర్తలు పరస్పరం స్వీట్లు పంచుకుంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం రాజ్యసభ సభ్యుని కార్యాలయ ఇంచార్జ్ మేకా లక్ష్మణ మూర్తి ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. సభలో మేకా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ నారా లోకేష్‌కు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు, సానా సతీష్ బాబుకు జాతీయ ఉపాధ్యక్ష పదవి రావడం పార్టీకి కొత్త దిశను చూపుతుందని అన్నారు. కష్టపడి పనిచేసిన నాయకులకు తగిన గుర్తింపు ఇస్తూ కాకినాడ జిల్లాకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తూ పొలిట్ బ్యూరో సభ్యునిగా, రాష్ట్ర కమిటీలో కూడా సభ్యునిగా నియమించడం అభినందనీయమని అన్నారు. యువ నాయకుడు నారా లోకేష్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ వంటి నిర్ణయాలు తీసుకోవడం ద్వారా నారీ శక్తికి ప్రాధాన్యత ఇస్తున్న పార్టీ విధానం ప్రశంసనీయమని అన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పడి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు లు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. నారా లోకేష్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు ను జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎంపిక కావడం పట్ల శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో నారా లోకేష్‌ను విమర్శించిన వారు నేడు ఆయన నాయకత్వాన్ని చూసి భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల్లో నారా లోకేష్ నాయకత్వంలో పార్టీ శక్తివంతంగా ముందుకు సాగి మళ్లీ అధికారంలోకి రావడానికి సమిష్టిగా కృషి చేస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల్ల శ్రీనివాసరావు (బున్ని), ఏటుకూరి నాగమణి, దేవ్ వెంకన్న, బోళ్ళ కృష్ణమోహన్, న్యూటన్ ఆనంద్, రామదేవ సీతయ్య దొర, అప్పికొండ వీవీ నరసింహ స్వామి, కాకరపల్లి చలపతిరావు, సునీత, రాయుడు దుర్గ, ఐటీడీపీ సభ్యులు పాలిక సతీష్, సీతామహాలక్ష్మి, ఉదయ్, సిరియాల కొండబాబు, అద్దంకి రాము నాయుడు, పెద్ద సంఖ్యలో మహిళలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈ - డిజిటల్ విధానం ద్వారా వివరాలను నమోదు చేసే పోర్టల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే నల్లమిల్లి



**అనపర్తి (మనసులో మాట) ఏప్రిల్ 16:** అనపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో భారతదేశ జనాభా గణన 2027 కార్యక్రమంలో భాగంగా, ఏప్రిల్ 16 నుంచి నుంచి ఏప్రిల్ 30 వరకు, స్వీయ గణన ప్రారంభమైన నేపథ్యంలో స్వీయ గణన పోర్టల్ ను కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా ప్రవేశపెట్టిన, ఈ - డిజిటల్ విధానం ద్వారా వివరాలను నమోదు చేసే పోర్టల్ ను ప్రారంభించిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ సందర్భంగా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ, స్వీయ గణన సౌకర్యాన్ని ప్రతి కుటుంబం వినియోగించుకోవాలని, సులభంగా మరియు త్వరగా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని స్వీయ గణనలో చురుకుగా పాల్గొని ప్రభుత్వానికి సహకరించాలని, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట ఎంపీడీఓ లు, స్పెషల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

# వెలివెన్నులో టీడీపీ విస్తృత స్థాయి సమావేశం





**నిడదవోలు మనసులో మాట ఏప్రియల్ 16..** నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామంలో రైతు సంఘ భవనం నందు నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం స్కిల్ దెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ నెల 18 వ తేదీ (శనివారం) నాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిడదవోలు పర్యటన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ & మాజీ శాసనసభ్యులు మరియు నిడదవోలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు మరియు ముఖ్య అతిథిగా పాల్గొన్న తూర్పు గోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రూడ చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి పాల్గొని నియోజకవర్గం నాయకులకు పార్టీ అధ్యక్షులుకు పర్యటన విజయవంతం చెయ్యాలని దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# స్వీయ సెన్సస్ నమోదు చేసిన ఏలూరు ఎమ్మెల్యే బడేటి

**- స్వీయ నమోదు కార్యక్రమంలో పాల్గొని, జనగణన ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలనీ ప్రజలకు ఎమ్మెల్యే విజ్ఞప్తి**




**ఏలూరు, ఏప్రిల్, 16 (మనసులో మాట)..** సెన్సస్ 2027 కార్యక్రమంలో భాగంగా గురువారం స్వీయ గణన నమోదు కార్యక్రమాన్ని ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ప్రారంభించారు. ఈనెల 16 నుండి 30వ తేదీ వరకు సెన్సస్ పోర్టల్ నందు కుటుంబ యజమానులు వారి స్వీయ వివరములు భారత ప్రభుత్వ వెబ్సైట్ నందు నమోదు చేసుకొనుటకు ప్రజలందరికీ అవకాశం కల్పించడంతో సదరు కార్యక్రమం ప్రారంభంలో భాగంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) https://se.census.gov.in పోర్టల్ ద్వారా తన కుటుంబం వివరాలను జనగణన స్వీయ నమోదు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ జగదంబ ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఏ .భాను ప్రతాప్ , ఏలూరు అర్బన్ తహసీల్దార్ గాయత్రి మరియు కలిసి ఎమ్మెల్యే గారిని మర్యాదపూర్వకంగా కలిసి, స్వీయ నమోదు ప్రక్రియ గురించి వివరించి గౌరవ శాసన సభ్యుల కుటుంబ వివరాలు స్వీయ నమోదు ప్రక్రియ ద్వారా నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రారంభించిన సందర్భంగా ఎమ్మెల్యే గారికి స్మారక చిహ్నం (మెమెంటో)ను అధికారులు అందజేశారు. ప్రజలందరూ ఈ స్వీయ నమోదు కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, జనగణన ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# నిబంధనలు ఉల్లంఘించిన రైస్ మిల్లులపై చర్యలు

**- ధాన్యం, బియ్యం సీజ్**

**- అస్తవ్యస్తంగా రిజిస్టర్ల నిర్వహణ**

**పిఠాపురం, (మనసులో మాట) ఏప్రిల్ 16:** మండలంలోని బి. పత్తిపాడు గ్రామంలో గల మూడు రైస్ మిల్లుల్లో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ చైర్మన్ తోట సుధీర్, జిల్లా అధికారి సత్యనారాయణ రాజు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శ్రీ సాయి బాలాజీ, శ్రీ శివ శంకర, శ్రీ శివ జ్యోతి రైస్ మిల్లుల్లో నిర్వహణ సరిగా లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. ముఖ్యంగా మిల్లు యజమానులు నిబంధనల ప్రకారం ఎ, బి రిజిస్టర్లను నిర్వహించకపోవడం, కనీస మద్దతు ధర వివరాలు నమోదు చేయకపోవడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీ శివ జ్యోతి రైస్ మిల్లులో స్టీమ్ రైస్‌లో ఫోర్టిఫైడ్ కెర్నల్స్ ఉండటంతో, వాటి శాంపిల్స్‌ను రసాయన పరీక్షలకు పంపారు. నిబంధనల ఉల్లంఘన నేపథ్యంలో 657 మెట్రిక్ టన్నుల ధాన్యం, 20 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేసి, సీఎంఆర్ లావాదేవీలను నిలిపివేస్తున్నట్లు డీఎస్ఓ ప్రకటించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ తహసీల్దార్లు వీరా స్వామి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతులకు అన్ని సౌకర్యాలు కల్పించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

**- ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు ...**



**ఏలూరు, ఏప్రియల్ 16(మనసులో మాట)..** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాలు ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు, గురువారం ఏలూరు పరిధిలోని విన్సెంటు డిపౌల్ విభిన్న ప్రతిభావంతులు గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు మాట్లాడుతూ వసతి గృహంలోని సభ్యులకు యాజమాన్యం అందిస్తున్న సౌకర్యాలు, ఆహార పదార్థాలు నాణ్యత వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాల్లో పొందటంలో అవసరమైన వారికి న్యాయ సహాయాన్ని ఉచితంగా అందిస్తామని తెలియజేయడం జరిగిందని, కొంత మంది సభ్యులకు ఆధారు కార్డు లేకపోవడం వల్ల విభిన్న ప్రతిభావంతులకు అందించే సంక్షేమ పథకాలను పొందటంలో జాప్యం జరగడాన్ని గుర్తించడం జరిగిందని తెలిపారు. ఆధారు కార్డులు అలాగే సంక్షేమ పథకాలును అప్లై చేయడానికి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఒక పారా లీగల్ వాలంటీరును ఏర్పాటు చేయడం జరుగుతుందని, అర్హులు అందరికీ న్యాయసహాయం అందిస్తామని తెలియజేశారు.

# సీఎం చంద్రబాబు నాయుడు పర్యాటన విజయవంతం చెయ్యాలి

**- మంత్రి కందుల దుర్గేష్**



**నిడదవోలు మనసులో మాట ఏప్రియల్ 16..** తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం నిడదవోలు పట్టణంలో ఈ నెల 18వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిడదవోలు పర్యటన చేయనున్న సందర్భంగా, నిడదవోలు రోటరీ క్లబ్ ఆడిటోరియంలో జనసేన, బీజేపీ నాయకులతో సమన్వయ సమావేశం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు, సభ నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని మంత్రి నాయకులకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిడదవోలు పర్యటనను నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.

# టిడిపి పార్టీ బలోపేతానికి కన్నబాబు కృషి ఎనలేనిది

**- రాష్ట్ర కార్యదర్శిగా పదవి దక్కడం పై కన్నబాబుకు అభినందనల వెల్లువ**

**- పెద్ద ఎత్తున తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు.**

**- శాలువలు కప్పి, పుష్పగుచ్చలు అందించిన తెదేపా శ్రేణులు**





**గోకవరం (మనసులో మాట), ఏప్రిల్ 16 :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కన్నబాబు హోలోనెన్ కు అభినందనలు వెల్లువిత్తాయి. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో గోకవరం మండలం కృష్ణునిపాలెం గ్రామంలో ఆయన కార్యాలయం వద్ద సందడి నెలకొంది. పుష్పగుచ్చాలు అందించడంతో పాటు శాలువాలు కప్పి, పూలదండలు వేసి ప్రతి ఒక్కరు ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం అందరి సమక్షంలో కన్నబాబు కేక్ కట్ చేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏ ఆపద వచ్చిన ఆదుకునే కన్నబాబు వంటి నాయకునికి రాష్ట్రస్థాయి పదవి దక్కడం తమ అదృష్టం అంటూ కొందరు భావోద్వేగంతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ శాసనసభ్యుడు, టిటిడి బోర్డు జ్యోతుల నెహ్రూ సారథ్యంలో టిడిపి పార్టీని మరింత బలోపేతం దిశగా కృషి చేస్తానని, కాకినాడ పార్లమెంటరీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ సారథ్యంలో పార్టీ విధివిధానాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తానన్నారు.

**అభినందనలు వెల్లువ**

ఏఎంసీ చైర్మన్ అడపా భరత్ కుమార్, సూరంపాలెం ప్రాజెక్టు చైర్మన్ ఉంగరాల రాము, సొసైటీ చైర్మన్ గాజంగం సత్తిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు పిల్లా అర్జున సారథి, పాలూరి బోసు బాబు, గునిపే భరత్, మండిగ గంగాధర్, బద్దిరెడ్డి అచ్చన్న దొర, బదిరెడ్డి బాబి, దాసరి సీతారాం, మండిగ బాలాజీ, మల్లి రెడ్డి శ్రీకృష్ణ., సాలాపు నలమహారాజు, ఉంగరాల గణేష్, పోసిన ప్రసాద్, బదిరెడ్డి రవి తదితరులు కన్నబాబును అభినందించారు అలాగే ది గోకవరం ప్రెస్ క్లబ్ సభ్యులు కన్నబాబును సన్మానించారు.




## జనసేన నేత అన్యం శ్రీరామ్ పై అట్రాసిటీ కేసు నమోదు చెయ్యాలి

### గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎదుట బాధిత మహిళ, దళితసంఘాల నేతలు ఆందోళన

**కాజులూరు, (మనసులో మాట ) ఏప్రిల్ 16 :** న్యాయం కోసం వెళ్లిన మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించటమేకాకుండా దళిత మహిళను కులం పేరుతో దూషించి అవమానించిన కాజులూరు జనసేన నాయకుడు అన్యం శ్రీరామచంద్రమూర్తి పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి అరేస్టు చెయ్యాలంటూ గురువారం బాదిత మహిళతో కలసి పలువురు దళితసంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా బాదిత మహిళ సన్నపు లక్ష్మీ మాట్లాడుతూ తన భర్త కిరణ్, ఆకుల నాగదేవి భర్త నాయుడు, నామా సుబ్బారావులు కలసి చేస్తున్న టైల్స్ వ్యాపారం లావాదేవీలలో తలెత్తిన వివాదంపై తమకు తగువు చెప్పాలని తానూ. ఆకుల నాగదేవి ఈ నెల తొమ్మిదవ తేదీ గురువారం గ్రామానికి చెందిన అన్యం శ్రీరామ్ ఇంటికి వెళ్లామన్నారు. అయితే అతను మహిళలమని కూడా చూడపండా అమానుషంగా ప్రవర్తిస్తూ కులంపేరుతో దూషించి ఇంటి నుంచి నెట్టివేసారన్నారు. దీనిపై ఈ నెల 11 వ తేది. శనివారం కులసంఘాల నేతలతో వచ్చి గొల్లపాలెం పోలీసులకు పిర్యాదులు చేసామన్నారు. దీనిపై పోలీసులు విచారణ చేసి కేసు నమోదు చెయ్యకుండా తాత్సర్యం చేస్తున్నారని, అన్యం శ్రీరామ్ కూటమి పార్టీలో ఉన్న దళిత నాయకులతో ప్రెస్మీట్లు పెట్టించి తమ పై తప్పుడు ప్రసంగాలు చేయిస్తున్నారన్నారు. దళితుల మద్య విబేదాలు సృష్టించి గొడవలు పెరేపిస్తున్నారన్నారు. అనంతరం వైఎస్సార్సీపీ మండల ఎస్సీ సెల్ కన్వీనర్ పోలినాటి సూర్యచంద్రం. బిఎస్పి జిల్లా అధ్యక్షులు "మాత సుబ్రహ్మణ్యం, జై భీమ్ పార్టీ అధ్యక్షులు ఏనుగుపల్లి కృష్ణ, అకిల భారత స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు పత్తిపాటి బుల్లిరాజు, మాలమహానాడు అధ్యక్షుడు సిద్దాంతుల కొండబాబు తదితరులు మాట్లాడుతూ తామంతా బాదితులకు బాసటగా ఉన్నామని పోలీసులు కేసునమోదుచేసి తగిన చర్యలు తీసుకొనకపోతే ఆందోళనలు వుదృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు పోతురాజు బాబురావు, గుబ్బల ఆదినారాయణ, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## సెలక్షన్ గ్రేడ్'గా పిఠాపురం మున్సిపాలిటీ

### - పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు



**పిఠాపురం, (మనసులో మాట) ఏప్రిల్ 16:** ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చొరవతో పిఠాపురం మున్సిపాలిటీ 'సెలక్షన్ గ్రేడ్'గా అప్‌గ్రేడ్ అవ్వడంపై బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ కంచర్ల భవాని శంకర్ హర్షం వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాలుగా లేని అభివృద్ధి జనసేన హయాంలోనే సాధ్యమైందని, పిఠాపురాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్న పవన్ కళ్యాణ్‌కు నియోజకవర్గ ప్రజల తరపున ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# గంజాయి మాఫియాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

### వార్షిక తనిఖీల్లో భాగంగా కాకినాడ జిల్లా లోని వివిధ పోలీస్ స్టేషన్ను క్షుణ్ణంగా పరిశీలించిన ఏలూరు ఐ.జి అశోక్ కుమార్



**కాకినాడ (మనసులో మాట ) ఏప్రిల్ 16** కాకినాడ 2 టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్, ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్, యు.కొత్తపల్లి పోలీస్ స్టేషన్లలో ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్, వార్షిక తనిఖీలు వార్షిక తనిఖీలలో భాగంగా ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్ కాకినాడ 2 టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్, ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లను సందర్శించి రికార్డులను గురువారం క్షుణ్ణంగా పరిశీలించారు. వారి వెంట జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఉన్నారు. మొదట కాకినాడ 2 టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఐజి కి పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించగా, అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. కేసు ఫైళ్లు, స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, మిస్సింగ్ కేసుల దర్యాప్తు పురోగతి తదితర అంశాలను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. తరువాత ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఉప్పాడ కొత్తపల్లి పోలీసు స్టేషన్ కు చేరుకుని వార్షిక తనిఖీలు నిర్వహించినారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లలోని క్రైమ్ రికార్డులు, సెంట్రీ బుక్, జనరల్ డైరీ మొదలగు రిజిస్టర్లు మరియు సి.సి.టి.ఎన్.ఎస్ డేటా ఎంట్రీలను పరిశీలించిన ఐజీ రికార్డుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఆదేశించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని సూచించారు. రౌడీ షీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచడంతో పాటు రాత్రి వేళల్లో గస్తీని మరింత ముమ్మరం చేసి నేర నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా పాత నేరస్తుల గుర్తింపును మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ ఉపయోగాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈగల్ టీమ్‌తో సమన్వయం చేసుకుంటూ గంజాయి మాఫియాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పోలీస్ లాగిన్స్ వినియోగంలో మరింత ముందుండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వారి సమస్యలను ఓపికగా విని త్వరిత పరిష్కారం చూపడం ద్వారా ఫ్రెండ్లీ పోలీసింగ్'పై ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని తెలిపారు. అలాగే స్టేషన్ ఆవరణలోని రిసెప్షన్ కౌంటర్, లాకప్ రూమ్, సిబ్బందికి కల్పిస్తున్న సౌకర్యాలు, పారిశుద్ధ్యం మరియు భద్రతా ఏర్పాట్లను స్వయంగా తనిఖీ చేసి అవసరమైన మార్గదర్శకాలు అందించారు. ఈ తనిఖీ కార్యక్రమం లో కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఏఎస్పీ పాటిల్ దేవ్ రాజ్ మనీష్, ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, కాకినాడ 2 టౌన్ ఇన్స్పెక్టర్ ఎం. అప్పల నాయుడు, కాకినాడ రూరల్ సిఐ డి. చైతన్య కృష్ణ ఇంద్రపాలెం ఎస్సై ఎం. వీరబాబు పిఠాపురం సీఐ జి శ్రీనివాసు, ఎస్సైలు జి వెంకటేష్, జానీ భాషా ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

### కలుషిత ఆహారం వల్లనే అనేక రకాలు వ్యాధులు వస్తున్నాయని

# ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలు వినియోగించాలి

### - జిల్లా వ్యవసాయ శాఖ జెడి యస్.కె. హాబీబ్ భాషా ...




**ఏలూరు, ఏప్రియల్ 16(మనసులో మాట)..** స్థానిక ఐఏడీపీ హాలులో గురువారం ప్రకృతి వ్యవసాయ అమలుపై విస్తృత స్థాయి శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించామని, ముసునూరు, కైకలూరు, కలిదిండి, మండవల్లి, బుట్టాయగూడెం, కుక్కునూరు, చాట్రాయి, ముదినేపల్లి తదితర మండలాలు నుండి సుమారు 120 మంది కేడరు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని జిల్లా వ్యవసాయ శాఖ జెడి యస్.కె.హబీబ్ భాషా తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి యస్.కె. హబీబ్ బాషా మరియు జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు బి.వెంకటేష్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామీణ స్థాయిలో విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వివరించారు. రైతులకు మరింత సులభతరం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులు పండించిన ఉత్పత్తులను 'తీవ్ష్త్రబయిఎజ్ఘుఝు.ఱఅ' వెబ్‌సైటు ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు. రైతులు మరింత కృషిచేసి మంచి నాణ్యతతో పాటు అధిక పోషక విలువలు కలిగిన కూరగాయలు, బియ్యం, పండ్లను ప్రజలకు అందించడం మన లక్ష్యమని పేర్కొన్నారు. అదేవిధంగా, ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగు (ూవీఇూ) విధానంలో నవధాన్యాలు సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ప్రతి రైతుకు నవధాన్యాలు విత్తన కిట్లు అందించి అవగాహన పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్రజల్లో పెరుగుతున్న ఆరోగ్య సమస్యలుపై కూడా వారు ఆందోళన వ్యక్తం చేశారు. కలుషిత ఆహారం వల్లనే అనేక రకాలు వ్యాధులు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు నేరుగా ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు వద్ద నుంచి ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. దీని ద్వారా రైతులకు మద్దతు లభించడమే కాకుండా, ప్రజలు తమ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చునని తెలిపారు.

# ఘనంగా కందుకూరి వీరేశలింగం జయంతి వేడుకలు



**గోకవరం (మనసులో మాట), ఏప్రిల్ 16 :** గోకవరం గ్రామం తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకలు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రామసేన సభ్యులు, భారతీయ జనతా పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బత్తుల నానాజీ, పెద్దాడ వెంకన్న దొర, కరిబండి వెంకటేశ్వరావు, పసల గణేష్, తాటికొండ సురేష్, నెల్లి శ్రీను, తుమ్మల బుజ్జి, గని రాజు, సోషల్ మీడియా కన్వీనర్ ఆదం మణికంఠ, సుబ్బారావు, రామసేన సిబ్బంది పాల్గొన్నారు



## సీఎం చంద్రబాబు సభా స్థలి పరిశీలన

**నిడదవోలు మనసులో మాట ఏప్రియల్ 16..** తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం నిడదవోలు పట్టణంలో ఈ నెల.18వ. తేదీన (శనివారం) ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిడదవోలు పర్యటన చేయనున్నారు.ఈ సందర్భంగా నిడదవోలు పట్టణం లో సభ ప్రాంగణం, హెలిప్యాడ్ ప్రాంతాలను చీఫ్ మినిస్టర్ ప్రోగ్రామింగ్ కో - ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ మరియు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్,స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు పరిశీలించి అధికారులకు ఏర్పాట్లు పై తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చే వెంకటేశ్వరరావు

**- కొత్తపల్లిలో దిండి సౌజన్యంతో చలివేంద్రం**




**గోకవరం (మనసులో మాట), ఏప్రిల్ 16 :** గోకవరం మండలం కొత్తపల్లి గ్రామంలో కామరాజుపేట రోడ్ లో వినాయకుడు గుడి వద్ద టిడిపి సీనియర్ నాయకుడు దిండి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేసి బాటసారులు వాహనదారుల దాహార్తి తీరుస్తున్నారని కూటమి టిడిపి మహిళా నాయకురాలు చల్లా రాజ్యలక్ష్మి తెలిపారు . ఈ విషయం పై దిండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వినాయకుడు గుడి కామరాజుపేట సూరంపాలెం కొత్తపల్లి వెళ్లే రోడ్లకు మధ్యలో ఉంటుందని అటుగా వెళ్లే బాటసారులు మండు వేసవి కావడం వల్ల ఆ గుడి దగ్గరకు వచ్చి కాసేపు సేదతీరి దాహం తీర్చుకొని వెళతారని దాహార్తుల దాహం తీర్చడానికి గుడి దగ్గర చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ముని వెంకట్రావు, దిండి సూరిబాబు, మేడిపూడి బుజ్జి, దిండి ప్రసాద్ రావు, జనసేన నాయకులు పువ్వల రాజు, వడ్డే ఆనంద్, మెడబోయిన ఎంకన్న, దిండి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి చేసుకుందాం

**- తొందర పడుతున్న యువతీ యువకులు**

**- పెరిగిన రేట్లు తో భయాందోళన లో తల్లిదండ్రులు**

**ముమ్మిడివరం(మనసులో మాట) ఏప్రిల్ 16..** గోదావరి పుష్కరాలకు ఇంకా పద్నాలుగు నెలలు సమయం మాత్రమే ఉంది. దాంతో గోదావరి పరీవాహక ప్రాంతాల వారు పెళ్లిళ్లు జరుపుకునేందుకు తొందరపడు తున్నారు.

ఎందుకంటే పుష్కరాల తరువాత ఏడాది కాలం పాటు ఈ ప్రాంత వాసులు వివాహాది శుభకార్యాలు జరుపుకోరు. అందుకే ఇప్పటికే వివాహాలు కుదుర్చుకున్న వారు ఈ ఏడాది చివరి నాటికి ఎలాగైనా పెళ్లిళ్లు జరుపుకోవాలని ఆతృత పడుతున్నారు. అయితే పశ్చిమ ఆసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా పెరిగిన వంట నూనెలు, గ్యాస్, ఇతర నిత్యావసర సరుకుల ధరలు పెళ్లివారి గుండెల్లో గుబులు రేపుతున్నాయి. గతంతో పోలిస్తే ఇప్పుడు పెళ్లి ఖర్చులు రెట్టింపు అవుతున్నాయని సామాన్య, మధ్యతరగతి వర్గాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెళ్లి ముహూర్తాన్ని వాయిదా వేద్దామా అంటే.. గోదావరి పుష్కరాలు దగ్గర పడుతున్నాయి. దాంతో పెళ్లిళ్లు చేసుకునేవారి పరిస్థితి ముందు నుయ్యి.. వెనక గొయ్యిలా మారింది.



**శుభకార్యాలు జరపరెందుకంటే.:**

గోదావరి జిల్లాల వాసులు చనిపోయిన తమ పితృ దేవతలకు పుష్కరాల సమయంలో పిండ ప్రదానం, షోడశ మహాదానాలు, దశదానాలు చేస్తారు. అందువల్ల పరీవాహక ప్రాంతంలో ఏడాది పాటు శుభకార్యాలు జరపకూడదని పండితులు, పురోహితులు చెబుతున్నారు. ఉభయ గోదావరి జిల్లాల వారితో పాటు, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన చాలా మంది ఈ సమయంలో శుభకార్యాలను జరుపుకోరు. ఈ ప్రాంతాల వారు కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాలకు వెళ్లి పెళ్లిళ్లు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ.. ఇది వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని. ఇది శాస్త్ర విరుద్ధమని భావించేవారు పుష్కరాల తరువాత ఏడాదిపాటు శుభ కార్యాలకు దూరంగానే ఉంటారు.

**భారంగా మారిన ధరలు:**

ప్రస్తుతం పెరిగిన ధరలు పెళ్లిళ్లు జరుపుకునే వారికి పెను భారంగా మారాయి. డెకరేషన్‌కు వినియోగించే పచ్చిపూలతో పాటు అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. నిత్యావసర ధరలు చుక్కలు చూపిస్తున్నాయి.

**గ్యాస్ ధరలు ఇలా:**

సిలిండర్ పెరిగిన ధరతో కలిపి రూ.954కాగా, బ్లాక్‌లో రూ.2 వేలకు విక్రయిస్తున్నారు.

కమర్షియల్ సిలిండర్ పెరిగిన ధరతో కలిపి రూ.1,930 కాగా, బ్లాక్‌లో దొరకడం లేదు. ఒకవేళ దొరికితే రూ.3 వేలకు విక్రయిస్తున్నారు.

ప్రస్తుత ముహూర్తాల్లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లా వ్యాప్తంగా భారీగా వివాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం, అమలాపురం, ద్వారక తిరుమల, మురముళ్ల వీరేశ్వర స్వామి మొదలైన ఆలయాల్లో పెళ్లిళ్లకు వేదిక అవుతాయి . బలమైన ముహూర్తాలు కావడం తో వేల సంఖ్యలో పెళ్లిళ్లు జరుగుతాయి.ఈనెల 11, 12, 29 తేదీల్లో పెళ్లిళ్లు అతి భారీగా జరనున్న నేపథ్యంలో గోదావరి జిల్లాల్లో ఇప్పటికే ఆలయాలు, కల్యాణ మండపాలు, గదులు దాదాపుగా అన్నీ ముందే బుక్ అయిపోయాయి. కేటరింగ్, వాయిద్యకారులు, డెకరేషన్ వ్యాపారులు, పురోహితులు బిజీబిజీగా ఉన్నారు.

ఏప్రిల్‌తో పాటు మే 18 వరకూ, అలాగే జూన్ 17 నుంచి జులై 9 వరకూ, ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 8 వరకూ, అక్టోబర్ 11 నుంచి 18 వరకూ, నవంబర్ 10 నుంచి వచ్చే ఏడాది జనవరి 7 వరకూ గోదావరి జిల్లాల వ్యాప్తంగా భారీగా వివాహాలు జరగనున్నాయి.

**ధరలు ఆకాశాన్ని అంటు తున్నాయి :**

యుద్ధం కారణంగా గ్యాస్, వంట నూనెల ధరలు బాగా పెరిగాయి. ఆ ఎఫెక్ట్ నిత్యావసర సరుకుల మీద కూడా పడింది. గతంతో పోలిస్తే ఇప్పుడు పెళ్లి చేయడానికి రెట్టింపు ఖర్చు అవుతోందని పెళ్లి కొడుకు, పెళ్లి కూతుళ్ల తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. గ్యాస్ కూడా దొరకడం లేదు. పశ్చిమ ఆసియాలో యుద్ధం జరుగుతుంటే.. పెళ్లివారికి ఇక్కడ సెగ తగులుతోంది

**పుష్కరాలు తర్వాత ఏడాది ఆగాల్సిందే :**

ఇప్పటికే పెళ్లిళ్లు కుదుర్చుకున్న గోదావరి పరివాహక ప్రాంతాల వారు త్వరపడి ఈ ముహూర్తాల్లోనే పెళ్లిళు చేసుకోవాలి. లేదంటే పుష్కరాల తరువాత ఏడాదిపాటు ఆగాల్సిందే.

**– పి.గోపాల కృష్ణామాచార్యులు, పురోహితులు**

# 18,19 తేదీలు సేంద్రియ ఆహార ఉత్పత్తులు మెగా మేళా విజయవంతం చెయ్యాలి

**- సేంద్రియ ఆహార ఉత్పత్తులు అలవాటు చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, పకృతి వ్యవసాయ రైతులకు బాసటగా నిలవాలి**

**- జిల్లా వ్యవసాయ శాఖ జెడి యస్.కె.హబీబ్ భాషా**

**ఏలూరు, ఏప్రియల్ 16(మనసులో మాట)..** జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం జాయింటు డైరెక్టరు ఛాంబర్లో గురువారం ఏలూరు రైతు సంపద సహజ మరియు సేంద్రియ ఆహార ఉత్పత్తులు మెగా మేళా ఈ నెల 18,19 తేదీలు జరగనున్న దృష్టా, పట్టణ ప్రజలు పాల్గొనాలని, కార్యక్రమం విజయవంతంపై పాత్రికేయులు సమావేశాన్ని జిల్లా వ్యవసాయ శాఖ జెడి యస్. కె.హబీబ్ భాషా నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ జెడి యస్.కె.హబీబ్ భాషా మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో వరితో సమానంగా ఉద్యానవన పంటలు మరియు పకృతి, సహజ, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు కూడా రైతులు సాగు చేస్తున్నారని అన్నారు. సేంద్రియ వ్యవసాయం ఉత్పత్తులు జిల్లాలో 50 వేలు మంది రైతులు సాగు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకృతి వ్యవసాయం మరింత పెంచాలని ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. జిల్లాలో పకృతి సహజ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు మరింత పెంచుటకు, పండించిన పంటలు వినియోగదారులకు అందించేలా, ప్రతి ఒక్కరికి చక్కని ఆరోగ్యం ఉండేలా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ప్రత్యేక దృష్టిపెట్టి ఏలూరు రైతు సంపద ఒక పోర్టల్ ఏర్పాటు చేశారని అన్నారు. ఈ పోర్టల్ నందు సుమారు 200 మంది సేంద్రియ వ్యవసాయ రైతులు, 213 ఉత్పత్తులు, 80 మంది ఫుడ్ ఎంటర్ ప్రైజెస్ వారు ఉన్నారని అన్నారు. తమ ఉత్పత్తులను, వినియోగదారులకు నేరుగా అందిస్తున్నారని, మధ్యవర్తులు లేకుండా వినియోగదారులు ఉత్పత్తిదారులు రేటు నిర్ణయించుకుని అమ్మకాలు విజయవంతంగా జరుగుతున్నాయని అన్నారు. ఏలూరు రైతు సంపదను మరింత వినియోగంలోకి తెచ్చేలా, అందరికీ తెలిసేలా ఈ నెల 18,19 తేదీలు మెగా మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు.స్థానిక డిసియంఎస్ ఫంక్షన్ హాలులో ఉదయం 9:00 గంటలు నుండి రాత్రి 9:00 గంటలు వరకు మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. ఇప్పటికే 50 స్టాల్స్ , 80 రైతులు, 150 వివిధ రకాలు ఉత్పత్తులు సిద్ధం అయ్యాయని, ఆసక్తి కలవారు ముందుకు రావాలని కోరారు.

మేళా యొక్క ప్రధాన ఉద్దేశ్యం సేంద్రియ మరియు సహజ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించడం, రైతులకు నేరుగా వినియోగదారులతో సంబంధం కల్పించడం మరియు ప్రజలకు ఆరోగ్య కరమైన ఆహారంపై అవగాహన కల్పించడం అన్నారు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలని, రైతులు ఉత్పత్తులను నేరుగా వినియోగ దారులకు విక్రయించే వేదిక అన్నారు. రైతులకు మార్కెటింగు అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ఆహార మేళా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం మని, రైతులు ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు చేపట్టామని అన్నారు. మేళాలో ప్రత్యేక ఆకర్షణలు నూజివీడు మామిడి పండ్లు, సేంద్రియ పండ్లు, కూరగాయలు, సహజ ఆహార పదార్థాలు, మిల్లెట్లు, సేంద్రియ బెల్లం, అపరాలు, నూనెలు, దేశ రకాలు బియ్యం, తదితర వాటిని వినియోగదారులకి పరిచయం చేస్తున్నామని అన్నారు. చాక్లెట్లు, పచ్చళ్ళు మరియు వివిధ రకాలు తిను బండారాలు మొదలగునవి ఉంటాయని తెలిపారు. ఏలూరు పట్టణ ప్రజలు అందరూ ఆహ్వానితులేనని అన్నారు. వివిధ శాఖలు అధికారులు, ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులను, బంధువులను, స్నేహితులను ఈ మేళాకు తీసుకురావాలని విరివిగా కొనుగోలు చేసి విజయవంతం చేసే బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. స్వయం సహాయ ఉత్పత్తులు -డ్వాక్రా ఉత్పత్తులు అమ్మకాలు కోసం స్వయం ఏలూరు పోర్టల్ కూడా అందుబాటులో ఉందని అన్నారు. మేళాలో డ్వాక్రా మహిళలు తయారుచేసిన 200 ఉత్పత్తులను కూడా మేళాలో ప్రదర్శించి, అమ్మకాలకు చర్యలు తీసుకుంటున్నామని, వాటిని కూడా ఆదరించి, కొనుగోలు చేసి వారిని ఆశీర్వదించాలని అన్నారు.

